# నేటి తరం

తెలుగు దినపత్రిక — అన్నీ వాస్తవాలే

గురువారం
మార్చి 26, 2026

సంపుటి :03
సంచిక : 246

Hyderabad,,karimnagar,khammam,Nalgonda,Nizamabad,
Warangal,Mahabubnagar,Rangareddy,Medak,Adilabad

సంపాదకులు : బొమ్మ అమరేందర్
పేజీలు : 08 వెల -6-

Follow :
www.netitharam.com









# మళ్లా తొక్కుత...

# లేవకుండ చేస్తా!

## ఈసారి తొక్కితే పాతాలమే దిక్కుగా తొక్కేస్తా!

## మళ్లీ వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తా.

- రెండోసారి నేనే సిఎం. అవుతా.
- సిఎం. రేవంత్ రెడ్డి పదే పదే చేస్తున్న వ్యాఖ్యలు.
- ఇదో రకమైన రాజకీయం..ప్రతిపక్షాలలో గందరగోళం.
- ఎన్నికలలో గెలిచిన నాటినుంచి ఓటమి లేదు.

- ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్‌ను గెలిపిస్తున్న సిఎం. రేవంత్ రెడ్డి.
- అన్ని విజయాలలోనూ తనదే పై చేయి.
- పార్టీ యంత్రాంగమంతా ఒక ఎత్తు.
- సిఎం. రేవంత్‌రెడ్డి మరో ఎత్తు.
- సిఎం. రంగంలోకి రాగానే పెరుగుతున్న హైప్.
- ప్రతిపక్షాలన్నీ సైలెంట్..రేవంత్‌రెడ్డి టాలెంట్.
- అంతటా సిఎం. రేవంత్ వన్ మాన్ షో.
- ఎన్నికలైనా, అసెంబ్లీ అయినా ఒకే ఒక్కడు.
- బిఆర్ఎస్‌కు వరుస ఓటములు రుచి చూపిస్తున్న సిఎం.
- చెప్పుకోవడానికి ఒక్క గెలుపు కూడా కారుకు లేకుండా చేస్తున్న రేవంత్.
- సై సై అంటూ కారు ముదుకు వచ్చిన ప్రతీసారి షెడ్డుకే ప్రయాణం.
- ఎమ్మెల్సీ ఎన్నికలంటే కూడా బిఆర్ఎస్ జడుకునేలా చేసిన సిఎం. రేవంత్.
- పార్లమెంటు గేటు కూడా తాకుండా కారును అరచేతితో ఆపిన సిఎం.

**నాయకుడు** ఎంత బలవంతుడో అనేది ఎన్నికల విజయాలే రుజువు చేస్తాయి. ఒక్కసారి గెలుపు బాట పట్టిన నాయకుడు వెనుతిరిగి చూసుకునే అవసరం రాకుండా చూసుకునే నాయకుడే నిజమైన పాలకుడు. అలాంటి పాలకులు గతంలో కాంగ్రెస్‌లో ఎవరూ లేరు. ఉద్దండులైన నాయకులు పాలకులుగా వున్నా, ఓటములు తప్పలేదు. కాంగ్రెస్‌పాలనలో కూడా అపజయాలు చవి చూడక తప్పలేదు. కాని మొట్ట మొదటి సారి కాంగ్రెస్ పార్టీకి అపజయం అనేది కనిపించకుండా అప్రహతిహతంగా విజయాలు అందిస్తున్న ఏకైక నాయకుడు సిఎం. రేవంత్‌రెడ్డి. గతంలో కాంగ్రెస్‌లో ఎంతో మంది బలమైన నాయకులు వుండేవారు. వాళ్లందరి కృషితో కాంగ్రెస్‌పార్టీ గెలిచేది. ఒంటి చేత్తో పార్టీని గెలిపించిన నాయకులు లేరు. ఒక దశలో పివి. నర్సింహారావు, చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి కాలంలో ఆ నాయకులు కీలకపాత్ర పోషించినా, సమిష్టి గెలుపుగానే చూస్తూ వచ్చారు. ఇతర నాయకులు కూడా తమ వల్ల పార్టీ గెలిచిందని చెప్పుకునే పరిస్థితి కనిపించేది. మొట్టమొదటి సారి కాంగ్రెస్ పార్టీలో నా వల్ల పార్టీ గెలిచిందని చెప్పుకోవడానికి నెంబర్ టూ అనే నాయకుడు లేని రాజకీయాలను సిఎం. రేవంత్‌రెడ్డి శాసిస్తున్నారు. తెలంగాణ రాజకీయాలను గుప్పిట్లో పెట్టుకొని నడిపిస్తున్నారు. కేవలం సొంత పార్టీనే కాదు, ప్రతిపక్షాలను కూడా తన కనుసైగలతో ఆపగలుతున్న నాయకుడు సిఎం. రేవంత్‌రెడ్డి. ప్రతిపక్ష నాయకులు బైట ఎన్ని కుప్పిగంతులు వేసినా, సిఎం. రేవంత్ ముందు అవి పారడం లేదు. ఆఖరుకు అసెంబ్లీలో సైతం సిఎం. రేవంత్‌ను ఎదుర్కొనే శక్తి వున్న నాయకుడు ఎవరూ లేరు. రేవంత్‌రెడ్డి పిసిసి. అధ్యక్షుడైనా నాటి నుంచి ఆయన పెంచిన దూకుడు కాంగ్రెస్‌కు ఎంతో బలాన్ని పెంచింది. అంత వరకు నిస్తేజంగా వున్న క్యాడర్ అంతా ఒక్కసారిగా తెరమీదకు వచ్చింది. అప్పటికే బిఆర్ఎస్ మీద అసంతృప్తితో వున్న వాళ్లంతా ఏకమయ్యారు. పార్టీకి మరింత బలం పెంచారు. ఆఖరుకు అన్ని వర్గాల ప్రజలను సిఎం. రేవంత్ రెడ్డి ఏకం చేయగలిగారు. పార్టీలో నాయకత్వాలలో వున్న లుకలుకలను బైటకు కనిపంచకుండా చేశారు. నాయకులకు కలుపుపోయే ప్రయత్నం బలంగా చేశారు. ఇప్పుడు ఏ నాయకుడు నోరు తెరవకుండా చేశారు. కోవర్టులుంటే ఇప్పుడే వెళ్లిపోండి అని ఆయన పిపిసి. అధ్యక్షుడుగా పార్టీ పగ్గాలు చేపట్టిననాడే పెద్ద సంచలనం సృష్టించారు. సహజంగా ప్రభుత్వంలో వున్నవారు ప్రతిపక్షాలను కట్టడి చేసే కాలంలో, ప్రతిపక్ష నేతగా అప్పటి పాలక పక్షాన్ని గుక్క తిప్పుకోకుండా చేశారు. నాడు రేవంత్‌రెడ్డి విసిరే సవాళ్లకు బిఆర్ఎస్ నాయకులకు సమాధానం లేకుండా చేశారు. ప్రతి విషయంలోనూ గత పాలకులను ఇరుకున పెట్టే ప్రయత్నం పదే పదే చేశారు. ఒక రకంగా ప్రతిపక్షంలో వున్ననాడే బిఆర్ఎస్‌కు ఊపిరి సలపకుండా చేశారు. ఇప్పుడు బిఆర్ఎస్ అగ్ర నేతతోసహా ఎవరినీ బలంగా ఊపిరి తీసుకోకుండా చేస్తున్నారు. ఉద్యమ కాలంలో తనంత వీరుడు లేడు, శూరుడు లేడని చెప్పగలిగిన కేసిఆర్ కూడా గత రెండున్నరేళుగా ప్రభుత్వం మీద మాట్లాడేందుకు కూడా ధైర్యం చేయలేకపోతున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో నోరు తెరిచిన కేసిఆర్ ఇప్పటి వరకు నోరు తెరవడంలేదు. ప్రభుత్వం మీద విమర్శ చేయడానికి జంకుతున్నారు. ఆఖరుకు కవితపై ఎన్ని ఆరోపనలు వచ్చినా సైలెంటే అయ్యారు. ఆఖరుకు ఆమె జైలు శిక్ష పడినా స్పందించలేనంత మౌనాన్ని కేసిఆర్ ఆశ్రయించారు. అటు కేంద్రంపై గాని, ఇటు రాష్ట్రంపై నోరు తెరిచేందుకు కూడా జంకే పరిస్థితి రావడంలో సిఎం. రేవంత్ రెడ్డి పాత్రే ఎక్కువ అని చెప్పాలి. గతంలోబిఆర్ఎస్ చేసిన అప్పులను కూడా చెప్పడానికి కూడా భయపడేది. కాని ఇప్పుడు ఈ రెండున్నరేళ్ల కాలంలో చేసిన అప్పు ఎంతో కూడా సిఎం. రేవంత్‌రెడ్డి నిండు అసెంబ్లీలో చెప్పగలిగారు. అలా అప్పులు తెచ్చిన సొమ్ము ఏం చేశారన్నది కూడా అడగలేని స్థితిలోకి ప్రతిపక్షాలను నెట్టేశారు. పైగా తాము ఇన్ని రకాల అభివృద్ధి పథకాలకు నిధులిస్తున్నామని సిఎం.రేవంత్ చెప్పినా వాటిని నిలదీసే శక్తి ప్రతిపక్షాలకు లేకుండా చేశారు. ఏదైనా సరే సిఎం. రేవంత్‌రెడ్డి నిజమే చెబుతున్నారన్న జనం ఇంకా నమ్ముతున్నారు. ఎందుకంటే సర్పంచ్ ఎన్నికల్లో సిఎం. రేవంత్‌రెడ్డి పోటీలో వున్న అభ్యర్థులకు చేసిన సూచన గతంలో ఏ నాయకుడు చేయలేదు. ఏ పాలకుడు అంత ధైర్యంగా మాట్లాడలేదు. అభ్యర్థులు తమ శక్తికి మించి ఖర్చు చేయొద్దని చెప్పిన ఏకైక నాయకుడు పాలకుడు సిఎం. రేవంత్‌రెడ్డి. ఖజానలో ఏమీ లేదు..గెలుపుల కోసం ఎక్కువ తక్కువ ఖర్చు పెట్టొద్దని చెప్పగలిని గట్స్ వున్న నాయకుడు సిఎం. రేవంత్‌రెడ్డి. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పులపై సిఎం. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలపై కూడా కనీసం కౌంటర్ ఇచ్చే పరిస్థితి ఆ నాయకులకు లేకుండాపోయింది. గతంలో పాలించిన ఏ నాయకుడు ఇంతలా వన్‌మ్యాన్‌షో చేయలేదు. ఒకప్పుడు రాజశేఖరరెడ్డి గురించి వన్ మ్యాన్‌షో అనేవారు. తర్వాత కేసిఆర్‌ను అన్నారు. కాని వాళ్లను మించిన వన్ మ్యాన్ షో చేస్తున్న అసలైన నాయకుడు సిఎం. రేవంత్‌రెడ్డి.

## ఉష్ణోగ్రతలు

| | కనిష్ట | గరిష్ట |
|---|---|---|
| Hyderabad | ~26 °C | ~30°C |
| Warangal | ~29 °C | ~29 °C |
| Karimnagar | ~28 °C | ~30 °C |
| Rangareddy | ~26 °C | ~28 °C |
| Khammam | ~26 °C | ~31 °C |
| Mahabubnagar | ~26 °C | ~29 °C |
| Nalgonda | ~28 °C | ~32 °C |
| Nizamabad | ~26 °C | ~31 °C |

## కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ నెక్ / రిటైల్-

Hyderabad
Per piece: ₹ 5.35
Per 100 pieces: ₹ 535
Per dozen: ₹ 64.2

warangal
Per piece: ₹ 5.37
Per 100 pieces: ₹ 537
Per dozen: ₹ 64.44



# ధూళిపాళ్ల కుమార్తె వివాహానికి హాజరైన సీఎంలు చంద్రబాబు, రేవంత్



గుంటూరు (కలెక్టరేట్): గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో నాగసాయి వైదీప్తి- కెవిన్ రామ్ వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎంలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



# అమ్రాబాద్ గిరిజనులకు పూర్తి అండ

» వారికి ప్రత్యామ్నాయ కాలనీ నిర్మాణం
» ఒక్కో కుటుంబానికి 15లక్షల పరిహారం
» నగదు అందచేసిన డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్,మార్చి25
అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజనుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల అభీష్టం మేరకే పునరావాసం చేపడుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో 14 గిరిజన కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 160 కుటుంబాలకు నగదు పరిహారం ఇవ్వగా, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.62.55 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు ఆధునిక పాఠశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. దేశంలోనే అత్యధిక పరిహారాల్లో ఒకటిగా భావిస్తున్న రూ.15 లక్షల ప్యాకేజ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభించనుంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు ఇది కీలకంగా మారనుంది. బచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# రాష్ట్రంలో పెట్రో, గ్యాస్ కొరత లేదు

» అపోహలు, వదంతులు నమ్మవద్ద
» డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్పష్టీకరణ

హైదరాబాద్,మార్చి25
హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశపు హాలులో రాష్ట్ర పౌర సరఫరాలు,




3లో

## కాంగ్రెస్ పార్టీకి

# జీవన్ రెడ్డి గుడ్‌బై

» నాలుగు పేజీల రాజీనామా లేఖ విడుదల
» పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా...పట్టించుకోరా
» కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
» ఇక రేవంత్ రెడ్డిపైనే తన పోరాటం అన్న జీవన్ రెడ్డి



జగిత్యాల,మార్చి25
కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి సిద్దంగా లేరు. ఈ క్రమంలో రాజీనామాపై మరోసారి స్పందించారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాలుగు పేజీల రాజీనామా లేఖను కార్యకర్తల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తానంటూ శపథం చేశారు. తనను నమ్ముకున్న అనుచరులకి పదవులు రాకపోతే పార్టీలో కొనసాగడం అవసరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలోనూ తాను న్యాయవాదిని అయినా పట్టించు కోలేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలని హింసించి కొట్టించినవారిని గద్దెనెక్కిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మాది అన్న ఫీలింగ్ మావారికి లేదని.. గాంధీభవన్‌లో ఫిరాయింపుల ఎమ్మెల్యే ఉంటే సమావేశంలో ఎలా పాల్గొంటారన్నారు. రాహుల్ గాంధీ ఫాంచ్ న్యాయ్ అని రాజ్యాంగం పట్టుకొని తిరుగుతే ఇక్కడ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారన్నారు.

03



# పార్టీ మారలేదన్న ఎమ్మెల్యల కేసు

## స్పీకర్‌తో సహా ఏడుగురికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్,మార్చి25:
పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు.

3లో



# కాంగ్రెస్ పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్

- ఫార్ములా రేస్ కేసు పెట్టిందే అందుకు
- పునరుద్ఘాటించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్,మార్చి25 :
ఫార్ములా ఈ రేసు కేసు పేరిట రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

## సిరిసిల్ల నేతన్నలను

# కాపాడండి

- విద్యుత్ బాకాయిలు మాఫీ చేయండి
- డిప్యూటి సిఎం భట్టికి కెటిఆర్ వినతి



3లో..

హైదరాబాద్,మార్చి25 :
సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిరిసిల్ల పవర్‌లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్‌చార్జీల భారంపై తుమ్మలకు సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు.


# రాష్ట్రంలో పెట్రోలు, కొరత లేదు

- డీలర్లు స్వయంగా ప్రకటన చేశారు
- కొందరు కావాలనే పుకార్ల వ్యాప్తి
- కేంద్రమంతరి బండి సంజయ్ వెల్లడి



3లో

హైదరాబాద్,మార్చి25 :
తెలంగాణ రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయిల్ సంస్థల వద్ద సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయంటూ.. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు.




3లో..

## తెలుగు రాష్ట్రాల్లో

# పెట్రోల్ కొరత

» నగరంలో పలుచోట్ల పెట్రో బంకుల మూత
» బంకుల ముందు క్యూ కడుతున్న వాహనదారులు

హైదరాబాద్,మార్చి25
అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో భారతదేశ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్‌కు కొరత ఏర్పడింది. కొన్ని రోజులుగా ప్రజలు వంట గ్యాస్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పెట్రోల్ నిల్వలు కూడా దేశంలో తగ్గిపోయాయన్న ప్రచారంతో బంకుల ముందు వాహనదారులు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

# కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

## - 27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన



హైదరాబాద్,మార్చి25
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.



3లో..

# హైదరాబాద్‌లో 70 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

హైదరాబాద్:
నగరంలోని అత్తాపూర్‌లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠా గుట్టు రట్టయింది. డెక్కన్ ట్రేడర్స్ గోదాములపై పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు.

## దమ్ముంటే సిద్దిపేటలో

# తనపై పోటీ చేయాలి

» రేవంత్ రెడ్డి మళ్లీ సిఎం కావడం కల్ల
» అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలి: హరీష్ రావు



3లో..

హైదరాబాద్,మార్చి25 :
రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. దమ్ముంటే సిద్ది పేటలో తనపై పోటీ చేయాలంటూ రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. అసెంబ్లీ లాబీలో హరీష్ రావు చిట్‌చాట్‌లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తల్లకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని అన్నారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్,మార్చి25
గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

రెండోవపేజీ తరువాయి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ది జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్దిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్దిదారులకు అందజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్జడెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గానికి నాలుగున్నర లక్షల ఇళ్లు అన్ని పల్లా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నియోజకవర్గానికి అన్ని ఇళ్లు ఉంటాయా అంటూ సందేహం వ్యక్తం చేశారు. సభను పక్కదారి పట్టించడమే ఏజెండాగా పెట్టుకున్నారని పల్లాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం పెట్టిన బ్జడెట్‌ను బీఆర్ఎస్ విమర్శిస్తుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. బడ్జెట్ పుస్తకాలను చించి పేదలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవమానించారంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిప్పులు చెరిగారు.

## సిరిసిల్ల నేతన్నలను కాపాడండి

రెండోవపేజీ తరువాయి

ఈ మేరకు అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రిని కలిసి ఒక లేఖను అందజేశారు.సిరిసిల్ల పట్టణం రాష్ట్ర వస్త్ర పరిశ్రమకు గుండెకాయ వంటిదని, గతంలో ఇక్కడ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన చేదు జ్ఞాపకాలను కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పి. వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల పరిశ్రమ నిలదొక్కుకుందని, అయితే ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న 'బ్యాక్ బిల్లింగ్' భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆయన వివరించారు. 2016 నుంచి 2024 వరకు ఉన్న కాలానికి సంబంధించి సుమారు 127 ఎస్.ఎస్.ఐ యూనిట్లపై అధికారులు రూ. 19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ భారం మోపారని, అది సర్‌చార్జిలతో కలిపి ఇప్పుడు రూ. 38 కోట్లకు చేరిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భారీ బకాయిలను చెల్లించలేక అనేక యూనిట్లు మూతపడటంతో పాటు, ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల భారాన్ని మానవీయ కోణంలో రద్దు చేసి నేతన్నను అదుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, కార్మికుల ఉపాధిని రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరుతూ కింద పేర్కొన్న అంశాలపై విజ్ఞప్తి చేశారు:? సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న బ్యాక్ బిల్లింగ్ మరియు సర్‌చార్జి మొత్తాలను పూర్తిగా మాఫీ చేయాలి. పాత బకాయిలతో సంబంధం లేకుండా, పరిశ్రమకు నిరంతరాయంగా విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా ఆదేశాలుఇవ్వాలి.కార్మికులు మళ్లీ ఆత్మహత్యల బాట పట్టకుండా తక్షణ ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. సిరిసిల్ల నేతన్నల సమస్య కేవలం ఒక ప్రాంతానిది కాదని, అది వేలాది కుటుంబాల మనుగడకు సంబంధించినదని కేటీఆర్ గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.కెటిఅర్ గారితోపాటు ఏంఏల్సీ ఎల్ రమణ గారు కూడా ఉన్నారు

## కాంగ్రెస్ పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్

రెండోవపేజీ తరువాయి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల నాలుగు నెలలైందని.. ప్రభుత్వానికి సంబంధించిన పత్రాలు, యంత్రాంగం అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో ఉన్నా.. బ్యాంక్ ద్వారా అధికారికంగా నిధులు బదిలీ చేసిన ఫార్ములా-ఈ అంశం మీద మాత్రమే కేసు పెట్టగలిగారని తెలిపారు. ఈ ఏసీబీ ఛార్జ్‌షీట్ రేవంత్ ప్రభుత్వం ఎంత నిస్పృహలో ఉందో చూపించడమే కాకుండా, మా హయాంలో జరిగిన మచ్చలేని పాలనకు సర్టిఫికేట్ లాంటిదని ఆయన స్పష్టం చేశారు.బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ఈ ఛార్జ్‌షీట్ ద్వారా స్పష్టం అవుతోందని కేటీఆర్ తెలిపారు. కేవలం అభివృద్దే లక్ష్యంగా చేసుకుని విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపామని స్పష్టం చేశారు. ఫార్ములా-ఈ రేస్ ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలిపేందుకు ఉపయోగించిన ?49 కోట్ల బ్యాంక్-టు-బ్యాంక్ నిధుల బదిలీని కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్ అంటుందా? అని ప్రశ్నించారు. స్కాంగ్రెస్ నాయకులారా.. రండి చూసుకుందామని సవాలు విసిరారు.

## తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

రెండోవపేజీ తరువాయి

క్యూ కట్టి మరీ బంకుల నుంచి పెద్దఎత్తున ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ అవసరం లేకున్నా లీటర్ల కొద్దీ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు వాహనదారులు. దీంతో పలు బంకులు తాత్కాలికంగా మూతపడ్డాయి. నగర వ్యాప్తంగా చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ప్రజలు మరింతగా ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ కొరతతో ఇబ్బందులు తప్పవన్న వదంతులే ఇందుకు కారణం. అయితే, దీనిపై తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింది్గ÷లంగాణలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపింది. రాష్ట్ర ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. పీఆర్ఎస్‌వో(ఖఖాక్ష)లకి విరుద్ధంగా ప్రజలు, బంకుల యాజమాన్యాలు ప్రవర్తించవద్దని చెప్పింది. అవసరాన్ని బట్టి మాత్రమే పెట్రోల్, డీజిల్ కొనాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సప్లయ్ చైన్స్ సరిగ్గా పని చేస్తున్నాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపింది. మరోవైపు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(ఃఖఅఒ) అడ్వైజరీ జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా నిరాధారమైనవని తెలిపింది. భారతదేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా సరఫరా నడుస్తోందని.. బీపీసీఎల్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని అడ్వైజరీలో తెలిపింది. పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారుల ఆందోళన నేపథ్యంలో తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పందించింది. పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో తప్పుడు ప్రచారాల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకులను పరుగులు తీస్తూ, ట్యాంకులు నింపుకుంటున్నారని తెలిపింది. ఈ భయాందోళనల కారణంగా సాధారణ స్థాయి కంటే 2.5 నుంచి 3 రెట్లు అధికంగా అమ్మకాలు జరుగుతు న్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలి కంగా ఇంధన నిల్వలు తగ్గినట్లు కనిపిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని స్పష్టంచేసింది. ఊఖఅఒ, ఎక్షఅఒ, ఃఖఅఒ సంస్థల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుందని తెలిపింది. పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని.. ఇది ఖఇ÷ాక్ష నిబంధనలకు విరుద్ధమని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇంధనాన్ని తప్పుగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం తెలిపింది. భయాందోళనలతో అధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించింది.

## కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి గుడ్‌బై

రెండోవపేజీ తరువాయి

ఈ వయస్సులో నేను పార్టీ మారి ఎం చేస్తాను. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చితే నేను ఎలా భరిస్తాను. నేను ఇరవై మాసాలు ఓపిక పట్టాను. కాంగ్రెస్ పార్టీలో నన్ను అడుక్కునే స్థాయికి పట్టుకొచ్చారు. మీనాక్షి నటరాజన్ ఎనభై శాతం సీట్లు నాకే ఇస్తామని మాట ఇచ్చారు.. ఆ మాట పట్టించుకోలేదు. నాకు టికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతాడు. పదవులు కావాలనుకుంటే నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాడిని. పీసీసీ అధ్యక్షుడు కావాల్సి నోడిని నా హక్కుల కొసం పోరాటం చేసే పరిస్థితి వచ్చింది. జీవన్ రెడ్డి అణగదొక్కాలన్నదే మీ ఆలోచన. చంద్రబాబు, కేసీఆర్‌ల మీద పోరాటం చేశాను.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తాను. అడుగులకి మడగులు ఒత్తేటోళ్ళే మీకు కావాలా? రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వాణ్ని అణగదొక్కారు. బతకవచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం సపహాదారుడా? పోచారం ఇప్పటివరకు ఏం సలహాలు ఇచ్చాడని సీనియర్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో రాహుల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ప్రవర్తిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. హైకమాండ్ తీరు, పార్టీలోకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తీసుకున్న కారణంగానే మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టార్జితమని.. పదేళ్లు తమను ఇబ్బంది పెట్టిన వారిని తీసుకువచ్చి పార్టీలో చేర్చుకుంటారా? అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్ణయాలు జాతీయస్థాయిలో ప్రభావితం చూపబోతున్నాయని.. 'జై భీమ్-జై సంవిధాన్-జై బాపు' నినాదాలకు తూట్లు పొడిచారంటూ విమర్శించారు. కాంగ్రెస్‌ను వీడటం బాధగా ఉన్నా తప్పడం లేదంటూ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వివరించారు.

## రాష్ట్రంలో పెట్రో, గ్యాస్ కొరత లేదు

రెండోవపేజీ తరువాయి

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. రెగ్యులర్ గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదాదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీ లను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు రెగ్యులర్ గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీ లకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంక్‌లు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అహ్మదాబాద్, సూరత్, నాగపూర్, చెన్నై వంటి నగరాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే బంక్‌లకు ఎలాంటి క్రెడిట్ సమస్యలు లేవని, సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కమిషనర్ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జన్నార్, సుధీర్ బాబు, ఆయిల్ కంపెనీల ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 70 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

రెండోవపేజీ తరువాయి

70 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదకర రసాయనాలతో తయారు చేస్తున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) బృందం, ఫుడ్ అడల్టరేషన్ (ఆహార కల్తీ నియంత్రణ) విభాగం అధికారులు కలిసి ఈ తనిఖీలు చేశారు.నిందితులు ముగ్గురు కలిసి ఎం.ఎం.పహాడీలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో గోదాంలను నడుపుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడించడం కోసం శాంటిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్, వెల్లుల్లి పొట్టును కలిపి నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నారు. ఈ తయారీ ప్రక్రియ అత్యంత అపరిశుభ్రంగా, ఈగలు, దుమ్ము ధూళి మధ్య జరుగుతోంది. ఇలా తయారు చేసిన ప్రమాదకరమైన పేస్ట్‌ను ప్లాస్టిక్ డబ్బాల్లో నింపి.. హైదరాబాద్ నగరంలోని హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

**కుళ్లిపోయిన కోడిగుడ్లతో పిల్లల తినుబండారాల తయారీ**

మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కాటెదాన్‌లోని ఒక అక్రమ ఆహార తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఇంద్ర సొసైటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా, అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు వాడుతూ పిల్లలు తినే డోనట్ బన్స్, కేకులు తయారు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు, ప్రమాదకర రసాయనాలను గుర్తించారు.

## రాష్ట్రంలో పెట్రోలు, కొరత లేదు

రెండోవపేజీ తరువాయి

కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.వాహనదారులు రోజువారీ అవసరాల మేరకు.. పెట్రోలు, డీజిల్‌ను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. 'అమెరికా, ఇజ్రాయిల్ ? ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడిందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. ఇండియన్ ఆయిల్, హెచ్ పీసీఎల్, బీపీసీఎల్ వంటి అన్ని పబ్లిక్ సెక్టార్ ఆయిల్ కంపెనీల వద్ద అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉంది. పెట్రోలు, డీజిల్ సరఫరాలోనూ లోపం లేదు. రాష్ట్ర అవసరాలకు సరిపడా పెట్రోలు, డీజిల్ సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇదే విషయాన్ని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోషియేషన్ కూడా స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మి చాలా మంది పెట్రోలు బంకుల వద్దకు పరుగులు తీస్తూ అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో కొన్ని పెట్రోలు బంకుల్లో తాత్కాలికంగా కొరత ఏర్పడుతోంది. ఇదే అదనుగా కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే ప్రమాదం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులను నమ్మొద్దని ప్రజలకు విజ&ఞప్తి చేస్తున్నా' అని అన్నారు.

## పార్టీ మారలేదన్న ఎమ్మెల్యల కేసు

రెండోవపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

## దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలి

రెండోవపేజీ తరువాయి

అసెంబ్లీ నిర్వహణపై కూడా ఆయన విమర్శలు చేశారు. సభను సమయానికి ప్రారంభించడం లేదని, టీ బ్రేక్ పేరుతో గంటల తరబడి వాయిదాలు వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రావడం, మంత్రుల సంసిద్ధత వంటి కారణాలతో సభను తరచుగా వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష గొంతును నొక్కుతున్నారని ఆరోపించిన హరీష్, అసెంబ్లీని మరో వారంరోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల బీఆర్ఎస్‌కు మేలు జరుగుతుందని, మహిళా రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ నష్టం జరుగుతుందని కూడా ఆయన పేర్కొన్నారు. ఇక ఉద్యోగాల అంశంపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని వ్యాఖ్యనించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, మొత్తం 16 నోటిఫికేషన్లు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. సంక్షేమ బోర్డుల పరిస్థితిపై కూడా హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 33 సంక్షేమ బోర్డులు ఉన్నప్పటికీ, వాటిలో 16కి మాత్రమే కార్యాలయాలు ఉన్నాయని, మిగిలిన 17 బోర్డులకు కార్యాలయాలు కూడా లేవని తెలిపారు. కార్పోరేషన్లకు కేటాయించిన నిధుల్లో 99 శాతం లాప్స్ అవుతున్నాయని, కేవలం 2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

## తేనెటీగల దాడితో పరుగులు

**- గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి**

శ్రీశైలం డ్యామ్ వద్ద తీవ్ర విషాదం నెలకొంది. తేనెటీగల దాడిలో ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. పిల్లి వీరస్వామి(52) అనే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్.. శ్రీశైలం డ్యామ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉండగా వీరస్వామిపై తేనెటీగలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. విపరీతంగా కుడుతుండడంతో తప్పించుకునే ప్రయత్నం చేశాడు.. దాడి నుంచి తప్పించుకునే క్రమంలో పరుగులు తీశారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. కానిస్టేబుల్ మృతి బాధిత కుటుంబం, డిపార్ట్‌మెంట్‌లో తీరని శోకాన్ని మిగిల్చింది.

## ఐదు టవర్లుగా సెక్రెటేరియట్ ఐకానికి టవర్

**- వేగంగా ఐదు టవర్ల నిర్మాణం పనులు**

**- పనులను పరిశీలించిన మంత్రి నారాయణ**

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్‌కు ఐకానిక్ టవర్లు డిజైన్ చేశామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. ఈ ఐదు టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో వీటి నిర్మాణం జరుగుతోందన్నారు. బుధవారం రాజధానిలో నిర్మిస్తున్న హెచ్‌ఓడీ టవర్ -3 కార్నర్ నోడ్ అమర్చే పనులకు మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో 4 నెలల పాటు ఈ పనులకు ఆటంకం కలిగిందని పేర్కొన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలు, మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక్గ÷నాన్స్ మోడల్ ఇచ్చారని చెప్పారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా రాజధాని అమరావతికి ఖర్చు పెట్టడం లేదని పేర్కొన్నారు. అమరావతి సెల్ఫ్గ÷నాన్స్ సిటీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ కొంతమంది అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్షించారన్నారు. ప్రస్తుతం ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోందని తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేస్తే.. ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఐసీఎల్ ఎండీ శ్రీనివాస్‌తో పాటు ఇంజనీర్లు

# గాజులరామారం సర్కిల్‌లో 'సేఫ్ రోడ్స్' దిశగా అడుగులు

- 99 రోజుల ప్రజా పాలనలో 20వ రోజు కార్యక్రమం విజయవంతం
- రహదారి భద్రత, శుభ్రతపై ప్రత్యేక దృష్టి




**గాజులరామారం, మార్చి 25 ( నేటితరం):**
ప్రజా సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని కొనసాగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో 20వ రోజు "సేఫ్ రోడ్స్ డిక్లరేషన్ ప్రోగ్రామ్"ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రహదారి భద్రత, శుభ్రత, ట్రాఫిక్ సౌకర్యాల మెరుగుదలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చడం, లేన్ మార్కింగ్‌లను పునరుద్ధరించడం, ఫుట్‌పాత్‌లను శుభ్రపరచడం వంటి చర్యలను చేపట్టారు. సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులను గుర్తించి వాటిని లక్ష్య ప్రాంతాలుగా నిర్ణయించడం ద్వారా పనులను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ నాయకత్వం వహించగా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (రాజెవీ) శ్రీ నిఖిల్ రెడ్డి , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహదేవ్ అనురాగ్ , అసిస్టెంట్ ఇంజనీర్ కళ్యాణ్ హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర రిసోర్స్ పర్సన్స్ సమన్వయంతో పనులు వేగంగా సాగాయి. ప్రజలకు సురక్షితమైన రహదారులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ తరహా కార్యక్రమాలు నగర అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా, ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

# పుస్తకాలకే పరిమితం కాదు... ఇప్పుడు నైపుణ్యాలే భవిష్యత్తు

- బ్యూటీ వెల్నెస్ ప్రయోగశాల ప్రారంభం
- విద్యార్థులకు ఉపాధి దిశగా కొత్త దారులు

**జీడిమెట్ల, మార్చి 25 ( నేటి తరం):**
ప్రస్తుత కాలంలో విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాకుండా నైపుణ్యాల ఆధారంగా అభివృద్ధి చెందుతోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్యకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో, జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు 2025--26 విద్యా సంవత్సరానికి అనుగుణంగా, తొమ్మిదో తరగతి నుంచి పై తరగతుల విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సులను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు బ్యూటీ, వెల్నెస్, హెల్త్ కేర్ కోర్సులు మంజూరు చేయబడగా, బ్యూటీ, వెల్నెస్ కోర్సు కోసం ప్రత్యేకంగా ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగశాలలో మానిక్యూర్ కిట్లు, ఫేషియల్ యంత్రాలు, పెడిక్యూర్ పరికరాలు, మేకప్ కిట్లు వంటి



ఆధునిక ఉపకరణాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ అందించేందుకు సన్నద్ధం చేశారు. ఈ నైపుణ్య ప్రయోగశాలను ప్రధానోపాధ్యాయులు ఎస్ సుధాకర్ పాఠశాల సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ నైపుణ్య అర్హత ప్రమాణాలకు అనుగుణంగా వ్యక్తిగత అలంకరణ, చర్మ సంరక్షణ, కేశాలంకరణ, మేకప్ కళ వంటి విభాగాల్లో విద్యార్థులకు ప్రామాణిక శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇన్స్ట్రక్టర్ నీలిమ మాట్లాడుతూ, ప్రాయోగిక నైపుణ్యాలు మరియు పరిశుభ్రత ప్రమాణాలతో విద్యార్థులను ఉపాధి అవకాశాలకు సిద్ధం చేయడమే లక్ష్యమని, ఈ కోర్సుల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయురాలు కళ్యాణి మాట్లాడుతూ, ఈ కోర్సుల ద్వారా పాఠశాలలో చదువుతున్న సుమారు ఆరు వందల మంది విద్యార్థులు అదనపు నైపుణ్యాలను పొందగలరని తెలిపారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు ప్రాథమిక చర్మ సంరక్షణ, రోమ నిర్మూలన, చేతి--కాలి అలంకరణ, కేశాలంకరణ, హెయిర్ కట్టింగ్ వంటి నైపుణ్యాలను నేర్చుకుని అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్ వంటి ఉద్యోగాల్లో చేరే అవకాశాలు పొందుతారు. అదేవిధంగా కాస్మెటాలజీ, వెల్నెస్‌లో ఉన్నత విద్యను అభ్యసించడం లేదా స్వయం ఉపాధి ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం కూడా సాధ్యమవుతుంది. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు "విద్యార్థులకు ప్రభుత్వం అందించిన గొప్ప అవకాశం"గా అభివర్ణించగా, విద్యార్థులు సైతం ఈ అవకాశంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్వహణకు వేలంపాటే మార్గం : ఎమ్మెల్యే కెపి. వివేకానంద్

- షట్టర్ల అమ్మకానికి బదులుగా వేలం నిర్వహిస్తే మౌలిక వసతులకు నిధులు -- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్

**కుత్బుల్లాపూర్, మార్చి 25 ( నేటితరం):**
తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో జరుగుతున్న 2026-27 బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఏడవ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్వహణ, కేటాయింపుల అంశంపై బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ప్రభుత్వం దృష్టికి కీలక అంశాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని



దుండిగల్, బహదూర్ పల్లి, నిజాంపేట్, బాచుపల్లి, డి.పోచంపల్లి, కైసర్ నగర్ ప్రాంతాల్లో సుమారు 13 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించగా, అందులో 9 వేల ఇళ్లను ఇప్పటికే లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.
హై రైజ్ అపార్ట్‌మెంట్‌ల రూపంలో నిర్మించిన ఈ ఇళ్లలో నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకొని గ్రౌండ్ ఫ్లోర్‌లో వాణిజ్య షట్టర్లు ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని ఇప్పటివరకు వేలం వేయకపోవడంతో లిఫ్ట్‌లు, విద్యుత్, ఎస్టిపి (స్యూ) నిర్వహణలో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హౌసింగ్ బోర్డ్ అధికారులు షట్టర్ల వేలంపాటకు క్యాబినెట్ ఆమోదం అవసరమని పేర్కొనగా, ఇప్పుడు వాటిని నేరుగా అమ్మే యోచనలో ఉన్నట్లు సమాచారం ఉందని ఆయన తెలిపారు. ఈ విధానం వల్ల భవిష్యత్తులో నిర్వహణ నిధుల కొరత మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు."షట్టర్లను అమ్మడం కంటే పారదర్శకంగా వేలంపాట నిర్వహించి, వచ్చిన ఆదాయాన్ని స్థానిక కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహణకు వినియోగిస్తే లిఫ్ట్‌లు, విద్యుత్, ఎస్టిపి వంటి మౌలిక సదుపాయాల నిర్వహణ సులభంగా జరుగుతుంది" అని వివేకానంద్ సూచించారు. ఇంకా భౌరంపేట్, గాగిల్లాపూర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎప్పుడు పూర్తవుతాయో ప్రభుత్వం స్పష్టమైన గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానికులకు 10 శాతం కేటాయింపు నిబంధన అమలులో భాగంగా ఖాళీగా ఉన్న ఫ్లాట్లను గుర్తించి, సంబంధిత గ్రామాల పేదలకు వెంటనే కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, లబ్ధిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.

# ఇంధన కొరత లేదు

## అపోహలే ఎక్కువ: పెట్రోలియం డీలర్స్ స్పష్టం

**భయంతో అధిక కొనుగోళ్లు... తాత్కాలికంగా నిల్వ తగ్గుదల మాత్రమే, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి**


TELANGANA PETROLEUM DEALERS ASSOCIATION

PRESS NOTE

- There is NO shortage of fuel
- Adequate stock is available with HPCL, IOCL, BPCL
- Supply chains are functioning normally

IMPORTANT SAFETY NOTICE

- Avoid panic buying
- Do not store fuel in unauthorised containers
- Purchase fuel only as per your regular needs

Let's work together to prevent inconvenience and ensure safety for all.
Do not believe or spread fake news
Stay informed, stay responsible
TELANGANA PETROLEUM DEALERS ASSOCIATION

**గాజులరామారం, మార్చి 25 ( నేటితరం):**
రాష్ట్రంలో ఇంధన కొరత ఉందన్న వార్తలు పూర్తిగా అసత్యమని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ పుకార్ల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోలు బంకుల వద్ద క్యూలు కడుతూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. అసోసియేషన్ వివరాల ప్రకారం, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వంటి ప్రధాన ఆయిల్ సంస్థల వద్ద ప్రస్తుతం తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయి. సరఫరా వ్యవస్థ ఎక్కడా ఆగలేదని, సాధారణంగా కొనసాగుతోందని తెలిపింది. అయితే, కొరత ఉందన్న భయంతో ప్రజలు ఒక్కసారిగా అధికంగా కొనుగోలు చేయడం వల్ల సాధారణ స్థాయి కంటే రెండున్నర నుండి మూడు రెట్లు అమ్మకాలు పెరిగాయని వెల్లడించింది. ఈ ఆకస్మిక డిమాండ్ పెరుగుదల కారణంగా కొన్నిచోట్ల బంకుల్లో తాత్కాలికంగా నిల్వ తగ్గిన పరిస్థితి కనిపించవచ్చని, కానీ అది ఇంధన కొరత కాదని స్పష్టం చేసింది. పరిస్థితి పూర్తిగా నియంత్రణలోనే ఉందని భరోసా ఇచ్చింది. అదేవిధంగా, పెట్రోలు లేదా డీజిల్‌ను డబ్బాలు, క్యాన్లలో నిల్వ చేయడం పెట్రోలియం పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నిబంధనలకు విరుద్ధమని హెచ్చరించింది. ఇలా నిల్వ చేయడం ప్రమాదకరమై అగ్ని ప్రమాదాలకు దారితీయవచ్చని సూచించింది. ప్రజలు తమ అవసరానికి సరిపడేంత మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వలు చేసుకోవద్దని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. తప్పుడు వార్తలను నమ్మకూడదని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరింది. ఇంధనంపై అపోహలు పక్కనబెట్టి, నిజమైన సమాచారంతో ముందుకు సాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇంధన కొరతపై బిఆర్ఎస్ ఫైర్...

## ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని తీవ్ర విమర్శలు

- "ముందస్తు ప్రణాళికల లోపం వల్లే ప్రజలకు ఇబ్బందులు" -- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, మార్చి 25 ( నేటితరం):**
రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సరఫరా లోపంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ తీవ్రంగా స్పందించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణినే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని మండిపడ్డారు. ప్రస్తుతం అనేక పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల వద్ద "నో స్టాక్" బోర్డులు కనిపిస్తున్నాయని, దీనివల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు చేసిన ముఖ్య వ్యాఖ్యలు : పెట్రోల్, డీజిల్, గ్యాస్



వంటి కీలక అవసరాల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకొని ముందుగానే తగిన నిల్వలు ఏర్పాటు చేసుకుని ఉంటే ఈ పరిస్థితి రాకపోయేదని పేర్కొన్నారు. ప్రస్తుత ఇంధన కొరత పరిస్థితి గతంలో ఎదురైన యూరియా కొరతను గుర్తు చేస్తోందని, ఇది పూర్తిగా ప్రభుత్వాల అశ్రద్ధకు నిదర్శనమని విమర్శించారు. ప్రపంచంలో యుద్ధ పరిస్థితులు ఉన్న దేశాల కంటే, యుద్ధం లేని మన దేశంలోనే ప్రజలు ఇబ్బందులు పడటం దురదృష్టకరమని అన్నారు. అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించి, అధిక నిల్వలు సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. పరిపాలనా వైఫల్యం, సమన్వయ లోపం కారణంగానే ఈ సంక్షోభం ఏర్పడిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఇప్పటికే ఆందోళనలో ఉండగా, కేంద్ర నాయకత్వం చేసిన ప్రకటనలు మరింత అయోమయాన్ని కలిగిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. చివరగా, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భేషజాలకు పోకుండా పరస్పర సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.

# శ్రీరామనవమి వేడుకలకు ఘన ఆహ్వానాలు

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు ఆలయ కమిటీల ఆహ్వానం
- నియోజకవర్గంలో ఉత్సవాలకు సన్నాహాలు



**కుత్బుల్లాపూర్, మార్చి 25 ( నేటితరం):**
శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు రామాలయాలు, హనుమాన్ ఆలయాల కమిటీ సభ్యులు స్థానిక మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న సీతారాముల కళ్యాణం, ప్రత్యేక పూజలు, వివిధ ధార్మిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాన్ని స్వీకరించి, నియోజకవర్గంలోని భక్తులతో కలిసి శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే, ఈ పర్వదినం ప్రజల్లో భక్తి భావాన్ని, ఐక్యతను మరింత పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయండి

## అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు

దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీలించి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

# వృద్ధ తల్లిదండ్రులను సరిగా చూసుకోని కొడుకులకు కౌన్సిలింగ్

**సిద్దిపేట మార్చి 25, (నేటి తరం)**
సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ టి. లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట త్రీ టౌన్ పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన పాముకుంటా నర్సయ్య -- ఎల్లవ్వ దంపతులు తమ ముగ్గురు కుమారులు యాదగిరి, కిష్టయ్య, దేవయ్యలకు తమ కష్టార్జిత ఆస్తులను సమానంగా పంచి ఇచ్చినప్పటికీ, సరైన పోషణ పొందడం లేదని ఈ నేల 18-నాడు సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై స్పందించిన సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టాటా లక్ష్మీబాబు
బుధవారం ముగ్గురు కుమారులు వారి భార్యలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. సమాజంలో వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ ప్రతి కుమారుని ప్రాథమిక బాధ్యత అని, తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, వారిని



వృద్ధాప్యంలో ఆదరించడం, పోషణ ఇవ్వడం, ఆరోగ్య సంరక్షణ చూడడం కుమారుల కర్తవ్యమని వివరించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం నైతికంగా తప్పే కాకుండా చట్టపరంగాను శిక్ష అర్హులని హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం కుమారులు తమ తల్లిదండ్రులను ఇకపై సక్రమంగా చూసుకుంటామని, ప్రతి నెల ఖర్చులకు సరైన డబ్బులను అందిస్తామని, అలాగే ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు అందరూ కలిసి వైద్యసహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా స్టేషన్ ఇన్స్పెక్టర్ టాటా లక్ష్మీబాబు మాట్లాడుతు సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్ వృద్ధుల గురించి ప్రత్యేక దృష్టి సారించినందున వృద్ధులైన తల్లిదండ్రులను సరిగా చూసుకోని కొడుకుల గురించి ఫిర్యాదు చేస్తే వారికి కౌన్సిలింగ్ నిర్వహించబడునని, వృద్ధుల పట్ల గౌరవం, సంరక్షణ మన సంస్కృతిలో భాగమని, ప్రతి కుటుంబం దీనిని కచ్చితంగా పాటించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి ఖమ్మంపల్లి గ్రామానికి స్వయంగా వెళ్లి వృద్ధ దంపతుల పరిస్థితిని పరిశీలిస్తానని తెల్పినారు.
ఇన్స్పెక్టర్ జోక్యంతో కుటుంబ వివాదం సఖ్యతగా పరిష్కారమవడంతో వృద్ధ దంపతులు పాముకుంటా నర్సయ్య-ఎల్లవ్వలు పోలీసుల సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు

# కార్మికుడిపై అన్యాయం... రవి ఎంట్రీతో యాజమాన్యం యూటర్న్

- 32 వేల వేతనం వెంటనే చెల్లింపు -- బీఆర్‌టీయూ పోరాటం ఫలితం

**కుత్బుల్లాపూర్, మార్చి 25 ( నేటితరం):**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గోపన్నపల్లి తండా ఇండస్ట్రియల్ ప్రాంతంలో సెక్యూరిటీ వర్కర్‌గా పనిచేస్తున్న అజిత్ కుమార్ సింగ్‌కు జరిగిన అన్యాయం బీఆర్‌టీయూ జోక్యంతో పరిష్కారమైంది. రెడీమిక్స్ కంపెనీలో పనిచేస్తున్న అజిత్ కుమార్ సింగ్‌ను ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా విధుల నుంచి తొలగించడంతో పాటు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన ?32,000 వేతనాన్ని కంపెనీ చెల్లించకుండా నిర్లక్ష్యం




చేసింది. పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో బాధితుడు కార్మిక నాయకులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి వెంటనే స్పందించి, సంబంధిత కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఆయన జోక్యంతో చివరకు కంపెనీ యాజమాన్యం బకాయి వేతనాన్ని పూర్తిగా చెల్లించింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, కార్మికులకు అన్యాయం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. న్యాయం జరిగిన అజిత్ కుమార్ సింగ్, తనకు సహాయం చేసిన రవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ది నిర్మాణం.క్యాంగ్రెస్ పార్టీది విధ్వంసం.

- ఆరు గ్యారంటీల గారడీతో ప్రజలను నిలువున ముంచిన కాంగ్రెస్ పార్టీ!
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్.



గజ్వేల్ మార్చి 25,( నేటి తరం) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి అప్లై చేసుకున్న వారికి బుధవారం మాజి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహకారంతో మంజూరు అయిన చెక్కులను లబ్ధిదారులకు అందచేయడం జరిగింది.
తలారి ఆంజనేయులు 14000, బోయిని పెద్దోళ్ల రవి 12500, బోయిని కరుణాకర్ 7500, ఉడిది రవి 14500 విలువ గలా చెక్కులను ఈరోజు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల నెపంతో ప్రజలను నట్టేట ముంచి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలలో తిరుగుబాటు మొదలయింది అన్నారు.అధికారంలోకి వచ్చిన తొలిరోజే ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీల అమలు ఫైలు పైన సంతకం చేసిన విషయం మరిచి 6 గ్యారంటీల అమలుకు నోచుకోలేదు అన్నారు.కాంగ్రెస్ పార్టీకి ప్రజల సంక్షేమం మీద చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.రేవంత్ తీసుకున్న నిర్ణయాల వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.
ఈ అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాడుతాం అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్నీ హామీలను విస్మరించిందని ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఇలా అన్ని వర్గాలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా, పంట బోనస్, బీమా ఆగిందెందుకు అని ప్రశ్నించారు. రుణమాఫీ కోసం లక్షల మంది ఎదురు చూస్తున్నారని అన్నారు. ఏటా మీరిస్తమన్న 2 లక్షల ఉద్యోగాలు ఏమైనయ్? మీరు పూర్తిజేస్తమన్న 18 ప్రాజెక్టులు ఏమైనయ్ అని ప్రశ్నించారుప్రభుత్వాలు వస్తయ్.. పోతయ్. కానీ తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అభివృద్ధిని ఓడించకండని , చరిత్ర ఎప్పుడూ నిర్మాణాన్ని గుర్తుపెట్టుకుంటుందని అన్నారు. విధ్వంసాన్ని క్షమించదని కచ్చితంగా శిక్షిస్తుందని అన్నారు.
ఇప్పటికైనా అబద్దాలు ఆపేసి, అభివృద్ధి వైపు అడుగులు వేయండి. లేదంటే తెలంగాణ సమాజం మిమ్మల్ని క్షమించదని హితవుపలికారు.రాహుల్‌గాంధీ మాట నమ్మి.. ప్రియాంకాగాంధీ బాస నమ్మి.. కాంగిరేసుకు ఓటేసిన ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతుందని అన్నారు.రెండున్నరేండ్లు గడిచినా మీ ఆరు గ్యారెంటీలు ఎందుకు అమలు కాలేదు? ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు అమలు చేసే వరకు మేము ప్రజల పక్షాన పోరాడుతామని అన్నారు..ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాజీ కో అప్షన్ అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామోద్దీన్, నాయకులు చదా శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనందం, కిష్టారెడ్డి, ముత్యం గౌడ్, సింగరేడి సంపత్ రెడ్డి, మంద యాదగిరి, మంద నరేష్, నర్సింహారెడ్డి, మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ బడ్జెట్ సమావేశం






గజ్వేల్ మార్చి 25, (నేటి తరం) స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ అధ్యక్షతన, కమిషనర్ =. వెంకట గోపాల్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ విమల రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాలను సభ ముందు ప్రవేశపెట్టడం జరిగినది.మొత్తం బడ్జెట్ అంచనా: 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 40.31 కోట్ల అంచన ఆదాయం మరియు అంచనా వ్యయం 39.88 కోట్లలతో బడ్జెట్‌ను రూపొందించారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ. 49.63 లక్షల మిగులును ప్రదర్శిస్తూ, ఆశాజనకమైన ఆర్థిక స్థితిగతులను వివరించారు. ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలను పాలకవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు ఈ బడ్జెట్ సమావేశానికి జుశ ఆఫీషో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ వంటేరి యాదవ రెడ్డి హాజరై, పట్టణ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్-చైర్మన్ పద్మ బాయి నర్సింగరావ్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఇట్టి సమావేశానికి సంబంధించి ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బడ్జెట్ నిధులను పట్టణంలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, వీధి దీపాలు మరియు పచ్చదనం పెంపొందించడం వంటి ప్రజా ప్రయోజన పనులకు ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేస్తామని వెల్లడించారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



వర్గల్ మార్చి 25 (నేటి తరం) సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాచారం గుట్ట సమీపంలోనీ ఒక పాత రూమ్ నందు గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.
సమాచారం అందుకున్న గౌరారం ఎస్సై బి . కరుణాకర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 50నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్నట్లు గత కొంత కాలంగా గూట్ట నందు బిక్షాటన చేస్తున్నట్లు గుర్తించమన్నారు మృతదేహం వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదు అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.గుర్తుతెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు గౌరవరం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు

# పాపయ్య కుంట రక్షణకు కదిలిన అధికారులు

# - కాలుష్యంపై కఠిన చర్యలు ప్రారంభం

- మురుగునీటి కలుషితంపై అప్రమత్తమైన నగర సంస్థలు
తుర్క చెరువు నుంచి వచ్చే ప్రవాహంపై ప్రత్యేక దృష్టి



బాచుపల్లి, మార్చి 25 ( నేటితరం): బాచుపల్లి--నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పాపయ్య కుంట రక్షణకు సంబంధించిన ఫిర్యాదులపై చివరకు సంబంధిత అధికారులు స్పందించారు. పలుమార్లు స్థానిక ప్రజలు చేసిన వినతుల మేరకు నగర పాలక సంస్థలు, సంబంధిత అధికారులు రంగంలోకి దిగుతూ చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో నిజాంపేట్ సర్కిల్‌కు చెందిన ఉప ఇంజనీర్, సహాయ ఇంజనీర్ సిబ్బంది సంయుక్తంగా పాపయ్య కుంటతో పాటు తుర్క చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా భూగర్భ మురుగునీటి కాలువల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. పరిశీలనలో భాగంగా 2021 సంవత్సరంలో తుర్క చెరువు నుంచి పాపయ్య కుంటలోకి మురుగునీరు చేరుతున్న విషయం అధికారుల దృష్టికి వచ్చింది. ఈ పరిస్థితి కొనసాగితే పాపయ్య కుంట మురికినీటి చెరువుగా మారే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మురుగునీటి మార్గాన్ని మార్చేందుకు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అదేవిధంగా పాపయ్య కుంట, రాజధాని పాఠశాల పరిసరాలు, బండారు లేఔట్ ప్రాంతాల్లో మురుగునీటి నిర్వహణ విభాగం అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించారు. సమస్య మూలాలను గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పాపయ్య కుంటను కాలుష్యం నుండి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. స్థానికులు కూడా ఈ చర్యలపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లాలో ఇంధన కొరత లేదు: తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్



సిద్దిపేట మార్చి 25 (నేటి తరం) జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో సరఫరా ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు అనవసర ఆందోళనకు గురై ఒకేసారి బంకులకు చేరుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు సాధారణ పంపిణీకి అంతరాయం కలుగుతుందని సిపి తెలిపారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి వాహనదారులు తమ వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపుకోవడానికి లేదా అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని సిపి సూచించారు. ఇలా చేయడం వల్ల ఇతరులకు అనవసరమైన అసౌకర్యం కలుగుతుందని, సాధారణ అవసరాల మేరకే ఇంధనాన్ని వినియోగించుకోవాలని కోరారు. నిర్ధారించని సమాచారాన్ని ఇతరులకు షేర్ చేయడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని సూచించడం జరిగింది.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందని తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే, వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

# జగద్గిరిగుట్టలో ఆధునాతన బస్ టెర్మినల్ -- డిపో ఏర్పాటుకు హామీ

- ప్రజా రవాణా విస్తరణపై ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ వినతి
- కొత్త రూట్లు, అదనపు సర్వీసులపై మంత్రి సానుకూల స్పందన



కుత్బుల్లాపూర్, మార్చి 2 ( నేటితరం): హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా సదుపాయాల అభివృద్ధి దిశగా కీలక ముందడుగు పడనుంది. 2026-27 బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నగరానికి చెందిన ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ తన నియోజకవర్గానికి సంబంధించిన పలు రవాణా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఆధునాతన బస్ టెర్మినల్‌తో పాటు బస్ డిపో ఏర్పాటు చేయాలని ఆయన ప్రధానంగా విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతం నుంచి ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, సరైన బస్ సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో బస్సులు నిలిపేందుకు స్థలం లేక రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు వేచి ఉండేందుకు కూడా తగిన సౌకర్యాలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులోని సర్వే నెంబర్లు 223, 224, 237, 238లో ఉన్న ప్రభుత్వ భూమిని బస్ డిపో కోసం కేటాయించాలని సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలకు సరైన బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలు కొత్త బస్సు మార్గాలు, సర్వీసులను ప్రతిపాదించారు. బాచుపల్లి, నిజాంపేట్ నుంచి సికింద్రాబాద్, మెహిదీపట్నం వరకు కొత్త రూట్లు, మియాపూర్ నుంచి కూకట్‌పల్లి, సికింద్రాబాద్, గండిమైసమ్మ వరకు సర్వీసులు ప్రారంభించాలని కోరారు. అలాగే బాలయ్యనగర్, బాలానగర్, కేపిహెచ్‌బీ ప్రాంతాలకు బస్సు సదుపాయం కల్పించాలని, లాల్‌సాహెబ్‌గూడ నుంచి సికింద్రాబాద్‌కు అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. కొత్తగా 224/+ రూట్ మియాపూర్ నుంచి మేడ్చల్ వరకు ప్రారంభించడం, నిలిపివేసిన 229కా నాగులూరు--మేడ్చల్ సర్వీసును పునఃప్రారంభించడం, 195 సిరీస్ బస్సుల రూట్లను విస్తరించడం, 229 బస్సును బౌరంపేట్ క్రాస్ రోడ్ వరకు పొడిగించడం వంటి ప్రతిపాదనలు కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వివేకానంద్ వినతిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే జగద్గిరిగుట్టలో ఆధునాతన బస్ టెర్మినల్‌తో పాటు బస్ డిపో ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# చెత్త బుట్టల పంపిణీ, పట్టణ ప్రణాళిక పనుల్లో పక్షపాత వైఖరి

- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ నాయకులు.



గజ్వేల్ మార్చి 25, (నేటి తరం) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సామాన్య ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ ఫలాలు కేవలం ఒక వర్గానికే అందుతున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ నాయకులు. మున్సిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకవర్గం రూ. 10 లక్షలు, ప్రస్తుత పాలకవర్గం రూ. 5 లక్షలు.. మొత్తంగా రూ. 15 లక్షల వ్యయంతో పట్టణంలో చెత్త బుట్టల పంపిణీ చేపట్టాలి. అయితే, ఈ పంపిణీ ప్రక్రియ అత్యంత అస్తవ్యస్తంగా సాగుతోందని, కేవలం బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికే వీటిని అందజేస్తున్నారని, పార్టీ కార్యకర్తలే వీటిని తమకు నచ్చిన వారికి పంచుకుంటున్నారని, వార్డులోని సామాన్య ప్రజలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఓనర్లకే కాకుండా, వార్డుల్లో నివసిస్తున్న అద్దెదారులకు సైతం చెత్త బుట్టలు అందజేయాలని, వార్డులో ఉన్న ప్రతి ఇంటికి ఇవి చేరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల పట్టణ ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా వార్డుల్లోని అన్ని పరిసరాలను శుభ్రం చేయాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో కేవలం గత పాలకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తల ఇండ్ల వద్ద మాత్రమే శుభ్రం చేస్తున్నారని, సామాన్య ప్రజలు నివసించే వీధులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఫిర్యాదులపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని, వార్డుల వారీగా పంపిణీ మరియు పారిశుధ్య పనుల్లో జరుగుతున్న లోపాలపై ఈ రోజే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. పక్షపాతం లేకుండా ప్రతి పౌరుడికి ప్రభుత్వ సౌకర్యాలు అందేలా చూస్తామని స్పష్టం చేశారన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో పెట్రోల్ బంకుల వద్ద హడావిడి...

# ఇంధన కొరతపై భయాందోళనలు!

- "నో స్టాక్" బోర్డులతో పెరిగిన అనుమానాలు -- బంకుల వద్ద భారీ క్యూలు, పోలీసుల జోక్యం




కుత్బుల్లాపూర్, మార్చి 25 ( నేటితరం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పెట్రోల్ బంకుల వద్ద అకస్మాత్తుగా వాహనదారులు బారులు తీరడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంధన కొరత వస్తుందనే ముందస్తు భయంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఒక్కసారిగా బంకుల వద్దకు చేరుకోవడం వల్ల భారీ క్యూలు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో బైకులు, కార్లు వరుసగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు బంకు యాజమాన్యాలు పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది. పోలీసుల సహకారంతోనే ఇంధన సరఫరా నిర్వహణ కొనసాగుతోంది. వందలాది మంది వాహనదారులు గంటల తరబడి క్యూలో నిలబడి ఇంధనం కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమంది ముందుగా ఫుల్ ట్యాంక్ చేయించుకోవడంతో, వెనుక ఉన్న వారికి పెట్రోల్ అందకపోవడం వల్ల అక్కడక్కడా పెట్రోల్ బంక్ యాజమాన్యాలతో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఇక కొన్నిచోట్ల పెట్రోల్ బంకుల వద్ద "నో స్టాక్" బోర్డులు కనిపించడం ప్రజల్లో మరింత ఆందోళన రేకెత్తించింది. అయితే బంకు యాజమాన్యాలు మాత్రం ఇంధన కొరత లేదని, సాధారణ సరఫరానే కొనసాగుతోందని స్పష్టం చేస్తున్నాయి.
అయితే, అధికారికంగా ఎలాంటి కొరత లేదని చెప్పినా, కొన్ని బంకుల వద్ద స్టాక్ లేదనే సంకేతాలు రావడం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. సరఫరాలో తాత్కాలిక అంతరాయమా? లేక వదంతుల ప్రభావమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వం స్పందించాలి:
ఈ పరిణామాల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను నివారించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు. ఇంధన సరఫరాపై స్పష్టమైన ప్రకటన చేసి, అవసరమైన చర్యలు తీసుకుంటే పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే అవకాశముందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విశ్లేషణ:
ఇలాంటి పరిస్థితులు సాధారణంగా వదంతులు లేదా సరఫరా అంతరాయాల కారణంగా ఏర్పడతాయి. కానీ అధికారుల నుంచి సమయానుకూల సమాచారం లేకపోతే ప్రజల్లో భయం మరింత పెరుగుతుంది. అందుకే పారదర్శక సమాచార వ్యవస్థతో పాటు సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇవ్వడం అత్యవసరం. మొత్తంగా, కుత్బుల్లాపూర్‌లో కనిపిస్తున్న ఈ దృశ్యాలు ప్రజల్లో పెరుగుతున్న అనిశ్చితికి నిదర్శనం. వెంటనే చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది.

# సదాశివపేట పట్టణంలో ఘనంగా ఈద్ మిలాప్ కార్యక్రమం

» ఈద్ మిలాప్ కార్యక్రమం పాల్గొన్న చింతా సాయినాథ్




**నేటితరం సదాశివపేట మార్చ్ 25**

సదాశివపేట పట్టణంలోని రాూా గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఈద్ మిలాప్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం స్నేహభావం, ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి తనయుడు చింత సాయినాథ్ గారు పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో మంచి వాతావరణం నెలకొల్పడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈద్ మిలాప్ అనేది పండుగ అనంతరం అందరూ కలసి శుభాకాంక్షలు చెప్పుకునే కార్యక్రమమని, ఇది మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, స్థానిక నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.'

# కేకే విరాట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు టి షర్ట్స్ పంపిణీ

**చిగురుమామిడి, మార్చి 25, ( నేటి తరం ):**



దేవక్కపెల్లి లో జరిగే క్రికెట్ టోర్నమెంట్ లో ఆడేందుకు వెళ్తున్న ఇందుర్తి క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా కేకే విరాట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో టీ-షర్ట్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ స్వప్న (డీజీవో), డాక్టర్ సురేష్ గౌడ్ (యూరలాజిస్ట్) హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులకు టీ-షర్ట్స్ అందజేస్తూ, క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. డాక్టర్ స్వప్న మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా పెంపొందిస్తాయని తెలిపారు. డాక్టర్ సురేష్ గౌడ్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు క్రీడాకారులకు మరింత ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మిన్ కొయ్యడ గంగాధర్ , మార్కెటింగ్ ఇంచార్జ్ అందేరాజు ,స్థానిక యువకులు, క్రీడాకారులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చి 28న జాతీయ లోక్ అదాలత్.

**రాయపోలు మార్చి 25 (నేటి తరం)**



జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయపోలు ఎస్ఐ కె.మానస తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 28న నిర్వహించనున్న ఈ లోక్ అదాలత్ చిన్న చిన్న కేసులకు తక్షణ పరిష్కారం అందించే వేదికగా నిలుస్తుందని సూచించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకునే పరిస్థితి నుంచి బయటపడేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం అని ఆమె పేర్కొన్నారు. కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, చెక్ బౌన్స్ కేసులు వంటి వివిధ రాజీ పడదగిన కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని సంప్రదించి ఇరువర్గాలు పరస్పరం రాజీకి రావచ్చని అన్నారు. ఇప్పటికే ప్రతి పోలీస్ స్టేషన్‌లో రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారితో కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని తెలిపారు.

# ఉల్లంపల్లిలో ఓపెన్ జిమ్, సీసీ రోడ్లకు భూమిపూజ



**చిగురుమామిడి, మార్చి 25 ( నేటి తరం ):**

మండల పరిధిలోని ఉల్లంపల్లి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. బుధవారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఓపెన్ జిమ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని, అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.?అనంతరం సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 5 లక్షల రూపాయల వ్యయంతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని... అలాగే రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కానవేణి శివ కుమార్, వార్డు సభ్యులు కోల స్వరూప, రజిత, సుదగోని రమాదేవి, ఇందిరా, కొత్త మధు, కోల ప్రభాకర్, గ్రామ పెద్దలు బల్లు బాల్లింగం, కానవేణి ఓదయ్యా, మల్లయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు మంత్రివర్గ ఆమోదం -- సీఎం రేవంత్ రెడ్డికి న్యాయవాదుల పాలాభిషేకం

తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన సందర్భంగా హుజురాబాద్ పట్టణంలో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జీడి రవితేజ ఆధ్వర్యంలో కోర్టు మెయిన్ గేట్ వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అలాగే పోలీసుల దౌర్జన్యాల నేపథ్యంలో న్యాయవాదులు పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. న్యాయవాదులకు రక్షణ కల్పించే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ క్రమంలో తాజా అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ మంత్రి మండలి అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును ఆమోదించడం పట్ల న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు పార్టీలకు అతీతంగా ఏకమై సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ కాలేజీ లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

» విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్ మను చౌదరి....

» విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్..

**మేడ్చల్ జిల్లా.ప్రతినిధి మార్చ్ 25 నేటితరం**

చదువు ఒకటే కాకుండా మీ అభిరుచి కి తగినట్టుగా అంశాలను ఎన్నుకొని వాటి పై దృష్టి పెట్టి అందులో నైపుణ్యతను పొంది మీ ప్రతిభను వెబ్ సైట్ ద్వారా కనబరిచే విధంగా చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి విద్యార్థులకు బోధించారు.

బుధవారం కీసర మండలంలోని నాగారంలో నిర్వహిస్తున్న మేడ్చల్ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ (బాలికలు) స్కూల్ మరియు జూనియర్ కాలేజీ ని సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వసతి గృహంలో అందుతున్న బోధన పై ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటు మీకు ఇష్టమైన స్పోర్ట్స్, గేమ్స్, మీ అభిరుచులలో కూడా మీ ప్రతిభను బయటపెట్టి అందులో





కూడా మీరు రాణించేలా మీకు అవసరమైన శిక్షణను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మీ పై మీకు ఆత్మవిశ్వాసం ఉండాలని, బిడియాన్ని వదిలి మీకు తెలిసిన విషయాన్ని నలుగురిలో మాట్లాడగలగాలని అప్పుడు మీ పై మీకు నమ్మకం కలుగుతుందన్నారు. చదువుతో పాటు మారుతున్న టెక్నాలజీని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకొని ఎక్కువ శ్రమ పడకుండా స్మార్ట్ వర్క్ చేయాలని తద్వారా టైమ్ సేవ్ అవుతుందన్నారు. ప్రస్తుతం చాట్ జిపిటి, జెమిని, పెర్ప్లెక్సిటి వంటి ఎఐ టూల్స్ ఎక్కువగా వినియోగించడం జరుగుతుందన్నారు. ఎఐ టూల్స్ ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రొగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోండి, అవి మీ భవిష్యత్తు ప్రయత్నాలలో ఎల్లప్పుడూ తోడ్పడతాయని, ఆత్మవిశ్వాసంతో ఉండాలంటే మీకు సబ్జెక్ట్ మీద అవగాహన ఉండాలని, సబ్జెక్ట్ అంటే కేవలం అకాడమిక్స్ మాత్రమే కాదని, ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకొని ఆ అంశం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంగ్లీషు బాగా నేర్చుకొని మీరు స్టేజ్ ఫియర్ తొలగించుకోవాలన్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ వారికి ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని, ఏమైనా కావాలా అని అడుగగా, విద్యార్థినులు ఆడుకోవడానికి ఫుట్ బాల్, చెస్, కావాలని కోరారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ అవసరమైనవి తప్పకుండా అందిస్తానని అన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ అవసరమైన వాటి కోసం, అలాగే విద్యార్థులు అడిగిన ఆట వస్తువుల ను కలుపుకొని ప్రతిపాదనలు తనకు పంపాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి కాంతమ్మ, కీసర ఎంఆర్ఓయాదగిరిరెడ్డి, ప్రిన్సిపల్ స్వప్న, స్కూల్ టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ కాలనీల వాణిజ్య సముదాయాల అమ్మకానికి వ్యతిరేకంగా చలో అసెంబ్లీ పిలుపు

» ప్రజలపై మెయింటెనెన్స్ భారం మోపే ప్రభుత్వ నిర్ణయం రద్దు చేయాలి -- సిపిఎం డిమాండ్

**బాచుపల్లి, మార్చి 25 ( నేటితరం):**

డబుల్ బెడ్ రూమ్ (2దీఎఖ) కాలనీల్లో నిర్మించిన వాణిజ్య సముదాయాలను వేలం ద్వారా విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రేపు నిర్వహించనున్న "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం బాచుపల్లి మండల కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీల వద్దకు వెళ్లి సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలను చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ---మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 16 డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో ఉన్న 992 వాణిజ్య సముదాయాలను వేలం ద్వారా అమ్మాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం



ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం పడకుండా ఉండేందుకు, కాలనీల నిర్వహణ ఖర్చులను భర్తీ చేయడానికి వాణిజ్య సముదాయాలను నిర్మించిందని తెలిపారు. ఈ సముదాయాల నుంచి వచ్చే కిరాయిలను లిఫ్టులు, మెయింటెనెన్స్ తదితర అవసరాలకు వినియోగించాలనే ఉద్దేశంతో నిర్మాణం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వాటిని విక్రయిస్తే, భవిష్యత్తులో మెయింటెనెన్స్ ఖర్చులు నేరుగా ప్రజలపై పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల అమ్మకాల ద్వారా వచ్చిన నిధులను అభివృద్ధి పనులకు వినియోగిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆ నిధులు త్వరగా ఖర్చవుతాయని, తద్వారా మళ్లీ ప్రజలపై భారం మిగులుతుందని అన్నారు. కిరాయి వసూలులో సమస్యలు ఉన్నాయని చెప్పి అమ్మకానికి దిగడం సరికాదని, అవసరమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా ప్రతి రెండు లేదా మూడు సంవత్సరాలకు వేలం ద్వారా కిరాయికి ఇచ్చే విధానం అమలు చేయవచ్చని తెలిపారు. భవిష్యత్తులో కిరాయిల విలువ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాణిజ్య సముదాయాల అమ్మకం తాత్కాలిక ప్రయోజనాల కోసమేనని అభిప్రాయపడ్డారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో ఇంకా పూర్తి కాలేని పనులను పూర్తి చేయడానికి, మరమ్మత్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేసింది. రేపు జరగబోయే చలో అసెంబ్లీ కార్యక్రమానికి డబుల్ బెడ్ రూమ్ కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వెల్ఫేర్ సంఘాల నాయకులు గోపాల్, స్వామి, నరేష్ తదితరులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# పేట్ బషీరాబాద్‌లో పెట్రోల్ బంకుల వద్ద కట్టుదిట్టమైన పోలీసు పర్యవేక్షణ

» స్టాక్ కొరత ప్రభావం లేకుండా ముందస్తు చర్యలు

» ప్రశాంతంగా కొనసాగిన పరిస్థితులు, ప్రజల సహకారం కీలకం

**పేట్ బషీరాబాద్, మార్చి 25 ( నేటి తరం):**

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, ఎలాంటి చట్టం-వ్యవస్థ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారు. ప్రజల్లో గందరగోళం ఏర్పడకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ పరిస్థితిని నియంత్రణలో ఉంచేందుకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ నిర్వహించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మొత్తం 16 పెట్రోల్ బంకులను ప్రత్యేకంగా పర్యవేక్షించిన పోలీసులు, కొన్ని బంకుల్లో "స్టాక్ లేదు" బోర్డులు ప్రదర్శిస్తున్న విషయాన్ని గుర్తించారు. దీంతో



ప్రజల్లో ఆందోళన నెలకొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి బంక్ వద్ద తగిన సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరించారు. రద్దీని సమర్థవంతంగా నియంత్రిస్తూ, ఎవరికి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసుల సమన్వయంతో అన్ని ప్రాంతాల్లో పరిస్థితులు పూర్తిగా ప్రశాంతంగా కొనసాగాయి. ఎక్కడా ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో స్థానిక ప్రజలు కూడా పోలీసులకు సహకరించడం గమనార్హం. ఈ సందర్భంగా పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైతే మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నకిలీ పత్రాల..భూకబ్జా ముఠా గుట్టురట్టు

» ఖైదీలైన ఖాకీ అధికారి, మరో ఎనిమిది మంది

» నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. కీసర పోలీసుల చాకచక్యం

» ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందాన్ని అభినందించిన డీసీపీ..




**కీసర ప్రతినిధి మార్చ్ 25: నేటితరం**

అమాయకుల భూములపై కన్నేసి, నకిలీ పత్రాలతో కాజేయాలని చూసిన భారీ భూకబ్జా ముఠాను కీసర పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ ముఠాలో ఒక ఏఎస్ఐ (ూూ×) స్థాయి పోలీసు అధికారి కూడా ఉండటం గమనార్హం. మరణ ధృవీకరణ పత్రాల నుంచి కుటుంబ సభ్యుల సర్టిఫికేట్ల వరకు అన్నింటినీ ఫోర్జరీ చేస్తూ, యజమానులకు తెలియకుండానే ఆస్తులను రిజిస్ట్రేషన్ చేస్తున్న ఇద్దరు ప్రధాన నిందితులతో సహా పలువురిని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు.

### » అసలేం జరిగిందంటే..

పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 16, 17 తేదీల్లో కేశబోయిన రమాదేవి, మదాను మాధురి అనే మహిళలు తమ భూములను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫోర్జరీ పత్రాలతో ఇతరులకు బదలాయించారని కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు.

### » అక్రమ మార్గం ఇలా..

ఈ ముఠా ప్రధానంగా ఖాళీగా ఉన్న ప్లాట్లను, యజమానులు అందుబాటులో లేని భూములను లక్ష్యంగా చేసుకుంటుంది. మొదట అసలు యజమానుల వివరాలు సేకరించి, వారు చనిపోయినట్లు నకిలీ 'డెత్ సర్టిఫికేట్లు' సృష్టిస్తారు. ఆపై నకిలీ వారసులను పుట్టించి, గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్లు, సేల్ డీడ్ల ద్వారా భూములను తమ అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తారు.

### » నిందితుల వివరాలు:

రెండు వేర్వేరు కేసుల్లో (జతీ. చీశ. 241/2026, 248/2026) పోలీసులు నిందితులను గుర్తించారు. మొదటి కేసులో కనకాటి లింగయ్య గౌడ్ (ఏఎస్ఐ), ప్రవీణ్ రెడ్డి, మోడెమ్ సంపత్, కాంబ్లే దీపలను అరెస్ట్ చేయగా.. రెండో కేసులో ఉప్పల వేణు, దొనపాటి వెంకట్ రెడ్డి, గుండిగ జ్యోతి, మదాను ఇన్నయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఫోర్జరీ చేసిన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

### » జాగ్రత్త వహించాలి: డిసిపి

"భూముల కొనుగోలు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలి" అని మల్కాజిగిరి డిసిపి. శ్రీధర్ సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందాన్ని ఆయన అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# వెన్నెల్లో సూరీడు ధారవాహిక నవల

13వ భాగం.

రచన పోచం సుజాత
7799114450



అప్పుడే సూర్య ఫోన్ రింగ్ అయింది.హాలో అన్నాడు సూర్య.హాలో మిస్టర్ సూర్యా!మీరు డొనేట్ చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ మిషన్ వచ్చింది. మీ చేతుల మీదుగా దానిని ఓపెన్ చేయించాలని మా స్కూల్ అందరి కోరిక. అందుకే మీకు ఆహ్వానం తెలుపుతున్నాము అన్నాడు ఫోన్లో అవతలి వ్యక్తి.షూర్ అండి వస్తాను. అని చెప్పి సూర్య ఫోన్ కట్ చేశాడు.రేపు ఊరిలో ఒక కార్యక్రమం వుంది శ్రవణ్ గారు.. నేను వెళ్ళాలి అన్నాడు సూర్య.ఏం కార్యక్రమం సూర్యా! అన్నాడు శ్రవణ్.నిన్న ఊరికి వెళ్ళినప్పుడు అక్కడ పాఠశాలలోని పిల్లలు మంచినీటి సమస్యతో బాధపడుతున్నారని తెలిసి ఏదో చిన్న సహాయం చేశాను. దానికి వాళ్ళు ఆ స్కూలులో చదివిన స్టూడెంట్ గా అక్కడ ఇప్పుడు చదువుకునే విద్యార్థుల అందరికీ మీరు మార్గదర్శిగా ఉండాలి. మీరే వచ్చి వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ ని ఓపెన్ చేయాలి అని చెబుతున్నారు. అన్నాడు సూర్య.ఓహో వెరీ గుడ్ సూర్య చాలా మంచి విషయం చెప్పావు. నిన్ను చూస్తువుంటే నాకు గర్వంగా ఉంది. నేను ఊరిలో చదువుకోలేదు. నా చదువంతా సిటీలోనే అయింది. ఊరి వాళ్ళ ప్రేమలు, ఆప్యాయతల గురించి మా గీత చెప్తూ ఉంటుంది. నాకు అవకాశం వస్తే, నేను కూడానా చేతనైన సహాయం చేసి వాళ్ల ప్రేమాభిమానాలను పొందాలని ఉంది. నీతో పాటు నేను కూడా రేపు వస్తాను. నా వైఫ్ గీత కూడా ఒక రైతు బిడ్డ. చాలా కష్టపడి డాక్టర్ చదివించారు వాళ్ళ నాన్నగారు.తాను కూడా తన సంపాదనలో ఎంతోకొంత తన ఊరికి పంపిస్తూ ఆర్థికంగా వెనుకబడిన వారికి మేలు చేస్తూ ఉంటుంది. అలా చేయడంలో ఉన్న సంతృప్తి ఎన్ని కోట్లు సంపాదించినా రాదండి. అని నాకు చెప్తుంది. అన్నాడు శ్రవణ్ సూర్యతో. అవును శ్రవణ్ గారు మేడం చెప్పింది హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్. ఒకరికి సహాయం చేయడంలో ఉన్న సంతోషం,ఆనందం అది మాటలకందని భాష.ఎవరికివారు ఆ సంతోషాన్ని అనుభవించాల్సిందే. కష్టపడిన వారు ఆలోచించిన అంతగా తాతల, తండ్రుల ఆస్తులు అనుభవించేవారు ఆలోచించలేరు అన్నాడు సూర్య.అవును సూర్య నీవు చిన్న వయసులోనే ఎంతో గొప్పగా ఆలోచిస్తావు. ఐ లైక్ యు అని మోగుతున్న ఫోన్ ని తీశాడు శ్రవణ్.హాలో గీతా డియర్! ఇప్పుడే నిన్ను గుర్తు చేసుకుంటున్నాను అన్నాడు శ్రవణ్.అవునా ఎందుకో? ల్యాప్ టాప్ తో కుస్తీ పట్టే, శ్రీవారికి సడన్ గా నేను ఎందుకు గుర్తుకు వచ్చాను. అన్నది గీత చిలిపిగా.అది ఇంటికి వచ్చాక చెప్తాను డియర్.. సూర్య కి ఒక ఫిజియో డాక్టర్ అవసరమైంది. నీకు తెలిసిన మీ ఫ్రెండ్స్ లో ఎవరైనా ఉన్నారా అన్నాడు శ్రవణ్.అయ్యో సూర్య కి ఏమైంది.అన్నది గీత కంగారుగా.సూర్య అంటే గీత కి చాలా ఇష్టం. సూర్య ని చూసినప్పుడల్లా,

తన తమ్ముడి పోలికలు సూర్యలో చాలా ఉన్నాయి అని అంటువుంటుంది. నాకు మా తమ్ముడు లాగా కనిపిస్తున్నావు సూర్యా మా తమ్ముడు ఇక్కడ లేకుండా, అనవసరంగా విదేశాలకు వెళ్ళాడు అంటువుంటుంది.సూర్య కి ఏమి కాలేదు కంగారు పడకు ఇంకా నమ్మలేదా అయితే సూర్యతోనే మాట్లాడు అంటూ ఫోన్ సూర్యకి అందించాడు శ్రవణ్.హాలో మేడం నమస్కారం అండి అన్నాడు సూర్య.హాయ్ సూర్యా!ఎలా ఉన్నావు.నీ కంటి వెలుగుల వెన్నెల ఎలా ఉంది.మీ ప్రేమ ఎంత వరకు వచ్చింది. ఎప్పుడు మీరిద్దరూ ఒకటి అవుతారా మాకు పెళ్లి భోజనం ఎప్పుడు పెట్టిస్తారా అని ఎదురుచూస్తున్నాము. అన్నది గీత నవ్వుతూ..వెన్నెల ఇప్పుడు బాగుంది మేడం.వాళ్ల నాన్న గారి గురించే ఫిజియో డాక్టర్ అవసరమైంది అంటూ శాస్త్రి గారి విషయం అంతా చెప్పాడు గీతకి సూర్య.ఓకే సూర్యా !నా క్లినిక్ పక్కనే ఒక డాక్టరు ఉన్నారు. కానీ అతను చాలా బిజీ పర్సన్. నేను అడిగితే కాదనరు అనుకుంటా అడిగి ఇప్పుడే చెప్తాను. అతను మంచి ట్రీట్మెంట్ ఇవ్వగలడు అన్నది గీత.సరే మేడం అని ఫోన్ శ్రవణ్ కి ఇచ్చాడు సూర్య.ఓకే డియర్ అంటూ ఫోన్ కట్ చేసాడు శ్రవణ్.సూర్య, శ్రవణ్ ఇద్దరూ కొత్త ప్రాజెక్టు రిక్రూట్మెంట్స్ గురించి, రేపు ఊరు వెళ్లి ప్రోగ్రాం గురించి డిస్కస్ చేసుకున్నారు.కొద్ది టైం తర్వాత గీత ఫోన్ చేసింది.ఆ డాక్టర్ ట్రీట్మెంట్ చేయడానికి ఒప్పుకున్నారు అని చెప్పింది గీత.వెంటనే వెన్నెల కుటుంబాన్ని ఇక్కడికి తీసుకు రావాలి అనుకున్నాడు సూర్య. మరునాడు సూర్య, శ్రవణ్ కలిసి శాస్త్రి గారి ఊరికి వెళ్లారు.శాస్త్రి గారి ఇంటికి వెళ్లి అతన్ని ట్రీట్మెంట్ కి హైదరాబాద్ వచ్చే విధంగా ఒప్పించారు.స్కూల్ లో ప్రోగ్రాం టైమ్ కి సూర్య, శ్రవణ్ వెళ్లారు. అక్కడ సూర్య చేత వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ ని ఓపెన్ చేయించారు స్కూల్ యాజమాన్యం వారు. అది పూర్తయిన తర్వాత పిల్లల్ని అందర్నీ కూర్చోబెట్టి స్టేజ్ పైన ఉన్న కొందరిలో డైరెక్టర్ గారు మాట్లాడారు.

సూర్య అని చూపిస్తూ...ఈ అబ్బాయి మిస్టర్ సూర్య.ఈ స్కూల్లోనే చదువుకున్నారు. చిన్న వయసులోనే కష్టపడి చదువుకొని పైకి ఎదిగి మంచి స్టేటస్ లో ఉన్నారు. నలుగురికి సహాయం చేస్తూ అందరి మన్నలను పొందుతూ తన పేరును సార్థకం చేసుకుంటున్నారు. మీరు కూడా చీకటి జీవితాలలో ఉన్న వారికి వెలుగును పంచే జ్యోతులై ఇలాంటి ఎందరో సూర్యలుగాకావాలని కోరుకుంటున్నాను.ఇప్పుడు సూర్య ని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను. అన్నాడు స్కూల్ డైరెక్టర్ గారు సూర్య కి మైకు అందిస్తూ..సూర్య మైకు తీసుకుని...ఇక్కడున్న పెద్దలకు, గురువులకు అందరికీ నా నమస్సుమాంజలి అన్నాడు.ప్రియమైన విద్యార్థులారా...!మీరంతా చదువును కష్టపడి కాకుండా ఇష్టంతో చదవండి అని చెప్పాడు. భారతదేశంలోని గొప్ప గొప్ప వారు ఆర్థికంగా వెనుకబడి ఉన్నా, ఇష్టంతో చదువుకొని వారు అనుకున్న గమ్యాన్ని చేర గలిగారు. ఉదాహరణకి అబ్దుల్ కలాం గారు. వారు రైతు కుటుంబం నుంచి వచ్చి తినడానికి సరైన ఆహారం కూడా లేకుండా రొట్టెలు తిని మంచిగా చదువుకొని దేశానికి ఉపయోగపడి ఆదర్శప్రాయంగా చరిత్రలో నిలిచారు.మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు కూడా కింది స్థాయి నుండి వచ్చి గొప్ప ఆశయంతో భారతదేశ ప్రధానమంత్రి అయ్యారు. వారి గురించి మీ అందరికీ తెలుసు. మన ముందు తరం వారిని ఆదర్శంగా తీసుకొని ఆశయాలతో ముందుకు వెళ్లి సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను, దురాచారాలను పారదోలాలి. ఏ గొప్ప కార్యమైనా, ఒక్క అడుగుతోనే ముందుకు సాగుతుంది. అలా మంచి బాటలో మనం వెళుతూ మన వెంట పదిమందిని నడిపించేలా చేయాలి. ఆడపిల్లలను తల్లిదండ్రులు కట్టుబాట్లతో పెంచకుండా ధైర్యంతో పెంచాలి. ఆడపిల్లలు కూడా మేము ఆడపిల్లను అనే భావన మనసులో నుంచి తీసివేయాలి.మేము కూడా ఏదైనా సాధించగలం అని మీ ముందు తరం గొప్ప గొప్ప మహిళా మణులను ఆదర్శంగా తీసుకొని ముందడుగు వేయాలి.అందుకు నిదర్శనం సావిత్రిబాయి పూలే గారు.వారు అప్పుడున్న సమాజంలో స్త్రీని అబలగా, వంటింటికే పరిమితం చేసినా కూడా కష్టాలకు ఓర్చుకుని కన్నీళ్లు దిగమింగి ధైర్యంతో పోరాడి భర్త సహకారంతో చదువుకొని మొదటి ఉపాధ్యాయురాలుగా నిలిచిన మహనీయురాలు ఆమె లేకపోతే ఈరోజు ఆడపిల్లలు చదువుకునే వారు కాదేమో.. మీరు కూడా ధైర్యంతో ముందుకు సాగాలి అప్పుడే మీరు విజయకేతనం

ఎగురవేయగలరు.మగపిల్లలు కూడా మేము మగ వాళ్ళము అనే అహంకారం లేకుండా, ప్రతి ఆడపిల్లను గౌరవిస్తూ, వారిని ప్రోత్సహించి సమానత్వాన్ని చూపిస్తే, మనదేశంలో ఈ వరకట్నాల గొడవలు ఉండవు. మీరంతా గొప్పవాళ్లుగా ఎదిగి నిస్వార్థంతో పక్కవారికి మేలు చేస్తూ ఉంటే ఇది ఒక చైన్ సిస్టం లాగా మారి మొదట ఊర్లు మారుతాయి.తరువాత సమాజము మారుతుంది. టోటల్ గా దేశం మారిపోతుంది. అప్పుడే మన దేశం అగ్రస్థానంలో నిలుస్తుంది. మీరంతా సినిమాలు చూస్తారు కదా అన్నాడు సూర్య నవ్వుతూ.సినిమాలు అనగానే పిల్లలంతా చూస్తాము సార్ అన్నారు గట్టిగా..మన నందమూరి తారక రామారావు గారు నటించిన అడవి రాముడు సినిమాలో వేటూరి సుందరామూర్తి గారు రాసిన పాట మీకు తెలిసే ఉంటుంది.“మనిషై పుట్టినవాడు కారాదు మట్టి బొమ్మ. పట్టుదలే ఉంటే కాగలడు మరో బ్రహ్మ. కృషివుంటే మనుషులు ఋషులౌతారు మహా పురుషులౌతారు. తరతరాలకి తరగని వెలుగౌతారు ఇలవేలుపు లౌతారు.” ఈ పాటని గుర్తు చేసుకుంటూ, మీరంతా మంచి బాటలో నడుస్తూ,మంచిని పెంచుతారని ఆశిస్తూ,ఆకాంక్షిస్తూ ముగిస్తున్నాను అని చెప్పాడు సూర్య.అక్కడి సభ అంతా కరతాళ ధ్వనులతో మారు మ్రోగింది. ప్రోగ్రాం కంప్లీట్ అయిన తరువాత శ్రవణ్ కూడా కొంత మంది విద్యార్థులకు చదువుకు సంబంధించిన వస్తువుల కోరకు కొంత డబ్బు రూపంలో స్కూల్ కి అందజేశాడు. స్కూల్ యాజమాన్యం వారి దగ్గర నుండి వీడ్కోలు తీసుకొని సూర్య , శ్రవణ్ బయలుదేరారు.

(ఇంకా ఉంది)

తరువాత భాగం 14

## మల్కాజ్ గిరి కోర్టు లో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్ ప్రారంభం...

» జిల్లా జడ్జి వి.బాల భాస్కర్ రావుతో కలిసి ప్లీడర్ ఛాంబర్ ను ప్రారంభించిన కలెక్టర్ మను చౌదరి.

**మేడ్చల్ జిల్లా.(కుషాయిగూడ)ప్రతినిధి మార్చ్ 25నేటితరం..**





కూషాయిగూడలో గల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు లో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్ ను బుధవారం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వి.బాల భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జడ్జి గవర్నమెంట్ ప్లీడర్ కె. రాంచందర్ రెడ్డి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి అమరావతి, నాల్గవ ఎడిజె డి.కిరణ్ కుమార్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటి సెక్రటరీ రవీందర్, ఫస్ట్ జూనియర్ సివిల్ జడ్జి రాజు, సెకండ్ జెసిజె ప్రశాంతి, మూడవ జెసిజె సరళరేఖ, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాపిరెడ్డి, జూనియర్ ఎజిపి సునితారాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్,యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మోరె చంద్రయ్య మార్చి 24, 2026 మంగళవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మరణించిన విషయం గ్రామస్థులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. కుటుంబానికి ఆధారస్తంభంగా ఉన్న ఆయన ఆకస్మిక మృతి పట్ల గ్రామ ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.ఈ విషాదకర విషయాన్ని తెలుసుకున్న మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి వెంటనే స్పందించి, నేడు మృతుడి నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
మానవత్వానికి ప్రతీకగా నిలుస్తూ, మేకల ఎల్లారెడ్డి తనవంతుగా మృతుడి కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయం కుటుంబానికి కొంత ఉపశమనాన్ని కలిగిస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి సమయంలో ముందుకు వచ్చి సహాయం చేయడం ద్వారా ఆయన తన సామాజిక బాధ్యతను చాటుకున్నారని స్థానికులు ప్రశంసించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా తాను ముందుండి సహాయం చేస్తానని, పరస్పర సహకారంతోనే సమాజం బలపడుతుందని పేర్కొన్నారు. గ్రామంలో ఇలాంటి సంఘటనలు బాధాకరమని, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వీణవంక మండల ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు పల్లెర్ల కిరణ్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నిమ్మల సమ్మయ్య, అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, గ్రామ పెద్దలు, యువకులు స్థానికులు పాల్గొన్నారు.మృతుడి కుటుంబానికి గ్రామస్థులు, నాయకులు అందరూ అండగా నిలవడం ద్వారా గ్రామంలో ఐక్యత స్పష్టంగా కనిపించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## బార్ కౌన్సిల్ సభ్యుడికి ఘన సన్మానం

తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన జి. కిరణ్ కుమార్ తొలిసారిగా వేములవాడ బార్ అసోసియేషన్‌కు బుధవారం విచ్చేశారు.ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం ఆయనకు శాలువాతో ఘన సన్మానం చేసి, స్వామి వారి చిత్రపటంతో పాటు లడ్డు ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. న్యాయవాదుల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## వీడిన జవహర్‌నగర్ హత్య కేసు మిస్టరీ ...

- కన్నతల్లినే కడతేర్చిన కుమార్తె.. ఇంట్లోనే పాతిపెట్టి సిమెంటుతో పూడ్చివేత!
- ప్రేమకు అడ్డుందని ఘాతుకం..

**నేరేడ్ మెట్ (జవహర్‌నగర్,) మార్చ్ 25 నేటితరం**
నవమాసాలు మోసి, కని పెంచిన కన్నతల్లి అని కూడా చూడకుండా.. ప్రేమించిన వాడితో కలిసి ఓ కుమార్తె చేసిన ఘాతుకం సమాజాన్ని నివ్వెరపరిచింది. తన ప్రేమకు అడ్డు పడుతోందని కన్నతల్లిని కత్తితో పొడిచి చంపి, ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లోనే పాతిపెట్టిన అమానుష ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం మల్కాజిగిరి జోన్ డీసీపీ శ్రీధర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.

**- ప్రేమ చిచ్చు.. పోక్సో కేసులు:**
పోలీసుల కథనం ప్రకారం.. కౌకూర్ భరత్‌నగర్‌కు చెందిన అంజు (40) వృత్తిరీత్యా పనిమనిషి. ఆమె చిన్న కుమార్తె (17) ఇంటర్ చదువుతున్న సమయంలో బీహార్‌కు చెందిన డ్రైవర్ మోంటీ కుమార్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో తల్లి అంజు తీవ్రంగా వ్యతిరేకించింది. బాలిక మైనర్ కావడంతో గతంలో



మోంటీపై రెండుసార్లు పోక్సో (POCSO) కేసులు నమోదయ్యాయి. జైలుకు వెళ్లి వచ్చినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు.

**- పక్కా పథకం ప్రకారం..:**
తల్లి అడ్డు తొలగించుకోవాలని పథకం వేసిన నిందితులు.. గత ఏడాది మే 12న ఘాతుకానికి ఒడిగట్టారు. ఇంట్లో నక్కి ఉన్న మోంటీ, బాలిక సంకేతం ఇవ్వగానే అంజుపై దాడి చేశాడు. కుమార్తె తల్లిని గట్టిగా పట్టుకోగా, మోంటీ కత్తితో ఆమె గుండెల్లో పొడిచి ప్రాణాలు తీశాడు. అనంతరం మృతదేహాన్ని బెడ్ కింద దాచి, రక్తం మరకలు తుడిచేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లోనే గుంత తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టి, పైన సిమెంటు, ఇసుకతో పక్కాగా పూడ్చివేశారు. ఎలుకల వల్ల నేల పాడైందని నమ్మించి రిపేరు చేయించారు.

**- అదృశ్యం కేసుతో మొదలై..:**





తల్లి కనిపించడం లేదంటూ పెద్ద కుమార్తె రోషిణి అక్టోబర్ 2025లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 'మహిళ అదృశ్యం' కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా మోంటీని విచారించగా అసలు నిజం బయటపడింది. హత్య తర్వాత నిందితులిద్దరూ కలిసి జీవిస్తూ, ఈ ఏడాది జనవరిలో పెళ్లి కూడా చేసుకున్నారని, ప్రస్తుతం వారికి రెండు నెలల బాబు ఉన్నాడని పోలీసులు తెలిపారు.

**- నిందితుల అరెస్ట్:**
నిందితుడి ఒప్పుకోలుతో తహసీల్దార్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం నిర్వహించారు. నిందితులు మోంటీ కుమార్ సింగ్ మరియు మైనర్ బాలికను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీస్ అధికారులను డీసీపీ అభినందించారు.

## మేదర్‌వాడలో విద్యుత్ బలోపేతం

### 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను 160 కేవీఏకి అప్‌గ్రేడ్

**జమ్మికుంట, మార్చి 25: జాతీయ నేటితరం**
జమ్మికుంట పట్టణంలోని మేదర్‌వాడ బస్టాండ్ వెనుక ప్రాంతంలో ఉన్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను 160 కేవీఏ సామర్థ్యంతో అప్‌గ్రేడ్ చేసి విద్యుత్ సరఫరాను మరింత బలోపేతం చేశారు. ఇటీవల కాలంలో ఆ ప్రాంతంలో గృహాల సంఖ్య పెరగడం, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించడం, అలాగే వేసవికాలంలో ఎయిర్ కండీషనర్లు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి విద్యుత్ ఉపకరణాల వినియోగం అధికమవడం వల్ల విద్యుత్‌పై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఈ అప్‌గ్రేడ్‌ను చేపట్టారు.
గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎక్కువ కావడం వల్ల తరచూ ఫ్యూజ్ ఆఫ్ అవడం, వోల్టేజ్ మార్పులు రావడం, విద్యుత్ అంతరాయాలు ఎదురవడం వంటి సమస్యలను స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకొని, ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు చేపట్టారు.
ఈ సందర్భంగా జమ్మికుంట అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) మాట్లాడుతూ, “ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఈ అప్‌గ్రేడ్ చేపట్టాము. ముఖ్యంగా వేసవిలో లోడ్ అధికంగా ఉండే సమయాల్లో కూడా అంతరాయాలు లేకుండా విద్యుత్



అందించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయి” అని తెలిపారు.
స్థానిక వార్డు కౌన్సిలర్ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ, “మేదర్‌వాడ ప్రాంత ప్రజలు చాలా కాలంగా విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ అప్‌గ్రేడ్‌తో ఈ సమస్యలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుంది. భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాము” అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, లైన్ మెన్‌లు, రవి. చారి స్థానిక ప్రజాప్రతినిధులు కాలనీవాసులు పాల్గొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం అనంతరం స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ



అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ అప్‌గ్రేడ్‌తో మేదర్‌వాడ ప్రాంతంలో విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా ఉండడంతో పాటు, వోల్టేజ్ సమస్యలు తగ్గి గృహోపకరణాల పనితీరు మెరుగుపడనుంది. అలాగే భవిష్యత్తులో పెరుగుతున్న లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టడం జరిగింది




# ధురంధర్ -2 కలెక్షన్ల సునామీ

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. **919** కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. **695** కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. **65** కోట్లు, ఆరవ రోజు రూ. **56** కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. **200** కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది.

ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.

## హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం

# రాజమౌళి మూవీ కోసం భారీ సెట్టింగ్









రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే. దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు **700** మీ **400** అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి **2027** వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో సాగుతుందని, అందుకే ఈ భారీ సెట్ పనులు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాలో ఒక సాహసికుడిగా కనిపించబోతున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా వారణాసి వంటి పుణ్యక్షేత్రాలను కూడా జోడించడం రాజమౌళి మార్క్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రాలలోని గ్రాండియర్ చూస్తుంటే, రాజమౌళి మరోసారి ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం మహేష్ బాబు తన మేకోవర్ కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. పొడవాటి జుట్టు, గడ్డంతో ఆయన కనిపిస్తున్న లుక్స్ ఇప్పటికే వైరల్ అయ్యాయి. ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా **2027** వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని **120** దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ఎ÷-లాన్ చేస్తున్నారు. మహేశ్ బాబుకి జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తోన్న ఈ చిత్రంలో విలన్‌గా మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్న విషయం తెలిసిందే.

## పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

## భయమేమీ లేదని వెల్లడించిన చిత్రబృదందం

### – త్వరగా కోరుకోవాలని పవన్ ఆకాంక్ష





మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ **30**న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి **27**న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్టైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద  పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.



## దర్శకులు అలా రాయడమే గొప్ప పురస్కారం

దర్శకులు మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్‌లు రాశామని చెప్పడమే అతి పెద్ద అవార్డు అంటోంది కథానాయిక మృణాల్ ఠాకూర్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె హిందీ చిత్రసీమ వెలుపల గుర్తింపు పొందడం గురించి పలు ఆసక్తికరమైన సంగతుల్ని పంచుకుంది. "చిత్రపరిశ్రమలో నేను ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్నాను. బహుశా ఇండస్ట్రీ తొలినాళ్లలో నటన పరంగా నేను రెడీగా లేనేమో. కానీ, ఇప్పుడు నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రాశామని దర్శకులు చెప్పడమే నాకు దక్కిన అతిపెద్ద పురస్కారం. నిజమే నేను చేసిన మొదటి తెలుగు సినిమా 'సీతారామం' బ్లాక్ బస్టర్ అయింది. దాంతో నటిగా నాకు దక్షిణాదిలో మంచి గుర్తింపు దొరికింది. ఆ విధంగానే ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాను. ఇప్పుడు నేను చేస్తున్న 'డెకాయిట్' చిత్రాన్ని తెలుగు, హిందీలో తెరకెక్కిస్తున్నారు. ముందుగా సన్నివేశాల్ని హిందీలో రిహార్సల్ చేయాలనుకునేదాన్ని. ఇప్పుడీ విషయంలో కొంచెం మెరుగుపడ్డాన"ని చెప్పుకొచ్చింది. త్వరలోనే 'డెకాయిట్' చిత్రంలో అడివి శేష్ సరసన తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతుంది మృణాల్.





# సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

## దర్శకుడు ప్రేమ్ స్పందన

ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే.అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందించారు. తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు.'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు.ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'పీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ్', 'చోళీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పుడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ **30**న ఈ సినిమా విడుదల కానుంది.

Edited..Printed published and owned by BOMMA PRAVALLIKA and printed at RK PRINTERS HNo .1-7-210/2 Kamla Nagar khapra ECL opposite bus stop HYD 62 Medchal malkhajgiri Telangana and publisher at North Kamla towers flat No 402 North Kamla Nagar near registration office Kapra ECIL Hyderabad Medchal malkajgiri 500062 Telangana editor BOMMA AMARENDER RNI title code: TELTEL.09496..Call 8074671575, email pravallika netha22101988@gmail.com